ANN తెలుగు
Follow: @ANNTELUGU
25-04-2025
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 144 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నెహ్రూ స్ఫూర్తితో భారత్ సమ్మిట్
### 100 దేశాల నుండి 450మంది ప్రతినిధులు
### నేటి నుండి ప్రతిష్టాత్మకంగా సదస్సు..
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా :** భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం నుంచి జరిగే ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 'ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ గురించి వివరిస్తాం. ఇందిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం.

మిగతా 3లో

**టాప్ న్యూస్**

## గట్టిగా జవాబివ్వండి
- కేంద్ర ప్రభుత్వ చర్యలకు పూర్తి మద్దతు
- అఖిలపక్ష భేటీలో ఖర్గే, రాహుల్ గాంధీ
- నేడు జమ్మూకశ్మీర్‌లో రాహుల్‌గాంధీ పర్యటన



03

## నిఘా వ్యవస్థ బీజేపీ కోసమే
- పహల్గామ్‌లో ఉగ్రదాడి
- తీవ్రంగా స్పందించిన షర్మిల



03

## పహల్గామ్ ఉగ్రదాడి వేళ
- ముస్లింలకు అసదుద్దీన్ ఒవైసీ కీలక పిలుపు
- నల్లరిబ్బన్ ధరించండి



03



## ఇది కశ్మీర్‌పై జరిగిన దాడి
- మా రక్తం మరిగిపోతుంది
- పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండించిన నటుడు ప్రకాశ్ రాజ్
- ఇది అమాయకులపైనే కాదు, కశ్మీర్‌పై జరిగిన దాడిగా అభివర్ణన
- నిజమైన కశ్మీరీలు హంతకులు కాదని, ఈ చర్య సిగ్గుచేటని వ్యాఖ్య
- బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతూ... సంఘీభావం ప్రకటన

వివరాలు 3లో




భారత్ దెబ్బకు కుదేలవుతున్న
## పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ
- కరాచీ స్టాక్ మార్కెట్ కుదేలు
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ కీలక దౌత్య, భద్రతాపరమైన చర్యలు
- సింధు జలాల ఒప్పందం రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత
- పాకిస్తాన్ క్షిపణి పరీక్ష నిర్వహణ... భారత్ నుంచి తీవ్ర హెచ్చరికలు

వివరాలు 3లో



రూపాయికి ఇడ్లీ వస్తుందో రాదో కానీ..
## ఎకరా భూమి ఇచ్చేశారు
- మూడు వేల కోట్ల విలువైన భూములు దోచి పెడుతున్నారు
- జగన్ సంచలన వ్యాఖ్యలు..!!

వివరాలు 5లో



ఉగ్రదాడికి పాల్పడడమే కాక.. భారత్ చర్యలపై భగ్గుమంటూ పాకిస్థాన్ కవ్వింపుకు దిగడంపై ప్రపంచం విస్తుపోతోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న కఠిన దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా పాకిస్తాన్ కూడా తీవ్రంగా స్పందించింది. సిమ్లా ఒప్పందంతో సహా భారత్‌తో ఉన్న అన్నిద్వైపాక్షిక ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన జాతీయ భద్రతా కమిటీ సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడాన్ని పాకిస్తాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఒప్పందం ప్రకారం తమకు రావాల్సిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా దారి మళ్లించడానికి ప్రయత్నిస్తే, దానిని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని పాక్ ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించింది. తమ జాతీయ శక్తి సామర్థ్యాల మేరకు పూర్తిస్థాయిలో ప్రతిస్పందిస్తామని స్పష్టం చేసింది.

- మహా నెట్ వర్క్



# యుద్ధ మేఘాలు

## భారత్‌తో ఢీ అంటున్న పాక్

02

- పహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్ చర్యలకు పాక్ ప్రతిచర్య
- సింధూ జల ఒప్పందాన్ని నిలిపివేయడం యుద్ధమే
- భారత్‌తో సిమ్లా సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాల తాత్కాలిక నిలిపివేత
- భారత విమానాలకు గగనతలం మూసివేత, వాణిజ్యంపై నిషేధం
- దౌత్య సిబ్బంది తగ్గింపు, వీసాల రద్దు వంటి ప్రతీకార నిర్ణయాలు
- పాకిస్థాన్ నావికాదళం కీలక విన్యాసాలు.. ఎయిర్ టు ఎయిర్ లైవ్ ఫైరింగ్ కసరత్తులు



## నీటియుద్ధానికి దారి తీస్తుంది
### భారత్‌పై పాకిస్థాన్ అక్కసు
- అంతర్జాతీయంగా పోరాడుతామంటూ ప్రకటన
- పాకిస్థాన్ కీలక భేటీలు.. కవ్వింపుకు యత్నాలు

02

## ఊహకు మించి శిక్షిస్తాం
పర్యాటకులపై కాదు.. ఇది దేశంపై జరిగిన దాడి

ప్రతీ ఒక్క ఉగ్రవాదిని ఏరిపారేస్తాం

ఉగ్రనేతలను కూడా విడిచిపెట్టం .. కూకటివేళ్లతో పెకిలిస్తాం

భారత్ తో పెట్టుకుంటే ఏం జరుగుతుందో చూపిస్తాం

బీహార్ సభలో ప్రధాని నరేంద్రమోదీ సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో

## యుద్ధం జరిగితే.. భారత్ దమ్మెంత?
పాకిస్థాన్‌పై ఎంతకాలం పోరాడాలి?

వివరాలు 4లో

## కుంభమేళా తరహాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ
### ఎల్కతుర్తిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సభ ఏర్పాట్ల పరిశీలన



**ఎల్కతుర్తి, మహా:** తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్షగా నిలబడేది గులాబీ జెండా మాత్రమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ బాగుండాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటారని.. కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం తమకు ఓట్లు బాగా రావాలని అనుకుంటున్నారని విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజల మధ్య చీలక తీసుకొచ్చి ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటాయని మండిపడ్డారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు. బీఆర్ఎస్ పార్టీలోని మహిళా నాయకత్వాన్ని పటిష్టం చేయడానికి కేసీఆర్ రోడ్ మ్యాప్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని చెప్పారు. కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ జరగబోతుందని చెప్పారు.



## పాలకుర్తిలో బీఆర్ఎస్ ఖాళీ
- ఎర్రబెల్లికి అత్తా కోడళ్ళ బిగ్ షాక్
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో భారీ చేరికలు

05

కేసీఆర్ సభ విజయవంతం
## అవుతుంది
- కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు ఆసక్తిగా ఉన్నారు
- గచ్చిబౌలి భూములపై స్మితా సబర్వాల్ ట్వీట్‌లో తప్పేం లేదు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు

03



## మహా ఎండలు
- ఇక రెండురోజులు.. కుతకుతే
- గరిష్ట ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న జనం



వివరాలు 5లో

# ఊహకు మించి శిక్షిస్తాం

- పర్యాటకులపై కాదు.. ఇది దేశంపై జరిగిన దాడి
- ప్రతీ ఒక్క ఉగ్రవాదిని ఏరిపారేస్తాం
- ఉగ్రనేతలను కూడా విడిచిపెట్టం ..కూకటివేళ్లతో పెకిలిస్తాం
- భారత్ తో పెట్టుకుంటే ఏం జరుగుతుందో చూపిస్తాం
- బీహార్ సభలో ప్రధాని నరేంద్రమోదీ

**ఢిల్లీ, మహా:** పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ ముష్కరులకు ఊహించని రీతిలో శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని, వారిని మట్టిలో కలిపి సమయం ఆసన్నమైందన్నారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదని, భారత్ ఆత్మపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, వెంటాడి భారత్ హతమారుస్తుందని స్పష్టం చేశారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదని దేశంపై జరిగిన దాడి అని అన్నారు. గురువారం బిహార్ మధుబనిలో పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న మోదీ, పహల్గాం ఉగ్రదాడిపై తొలిసారి మాట్లాడారు. ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు.

**ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు**

కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని మోదీ తెలిపారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయిందని, ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడని అన్నారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రతి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని మోదీ హెచ్చరించారు. అదే సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరని మోదీ స్పష్టం చేశారు.




"ఉగ్రదాడికి పాల్పడడమే కాక.. భారత్ చర్యలపై భగ్గుమంటూ పాకిస్థాన్ కవ్వింపుకు దిగడంపై ప్రపంచం విస్తుపోతోంది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న కఠిన దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా పాకిస్తాన్ కూడా తీవ్రంగా స్పందించింది. సిమ్లా ఒప్పందంతో సహా భారత్‌తో ఉన్న అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన జాతీయ భద్రతా కమిటీ సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడాన్ని పాకిస్తాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఒప్పందం ప్రకారం తమకు రావాల్సిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా దారి మళ్లించడానికి ప్రయత్నిస్తే, దానిని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని పాక్ ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించింది. తమ జాతీయ శక్తి సామర్థ్యాల మేరకు పూర్తిస్థాయిలో ప్రతిస్పందిస్తామని స్పష్టం చేసింది."

- మహా నెట్ వర్క్

# యుద్ధ మేఘాలు

## తక్షణమే గగనతలం బంద్

భారత్‌కు చెందిన లేదా భారత్ ద్వారా నడిచే అన్ని విమానాలకు తక్షణమే తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని, పాకిస్తాన్ మీదుగా ఇతర దేశాలకు జరిగే వాణిజ్యాన్ని కూడా తక్షణమే నిలిపివేస్తున్నట్లు తెలిపింది. భారత్ చర్యలకు బదులుగా వాఘా సరిహద్దు పోస్టును మూసివేయడంతో పాటు, ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌లోని సిబ్బంది సంఖ్యను 30కి తగ్గించాలని, ఇక్కడి భారత రక్షణ శాఖ అధికారులను బహిష్కరించాలని కూడా పాకిస్తాన్ నిర్ణయించింది. భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగానే పాకిస్తాన్ ఈ నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, దౌత్య సంబంధాలను తగ్గించడం, పాక్ దౌత్యవేత్తలను, రక్షణ శాఖ అధికారులను బహిష్కరించడం, పాక్ పౌరులకు వీసాలు రద్దు చేసి 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించడం, అటారీవాఘా సరిహద్దును మూసివేయడం వంటి చర్యలను భారత్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, పాకిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం, సరిహద్దుల ఆవల హత్యలు, అంతర్జాతీయ చట్టాలను, కాశ్మీర్‌పై ఐక్యరాజ్యసమితి తీర్మానాలను భారత్ పాటించడం లేదని ఆరోపిస్తూ, ఈ పరిస్థితులు చక్కబడే వరకు ఒప్పందాలను నిలిపివేస్తున్నట్లు పాకిస్తాన్ పేర్కొంది.



## పాకిస్థాన్ యుద్ధ సన్నాహాలు

పాకిస్థాన్ నావికాదళం కీలక సైనిక విన్యాసాలకు సిద్ధమైంది. నేటి నుంచి రెండు రోజుల పాటు ఈ కసరత్తులు కొనసాగనున్నాయి. కరాచీ, గ్వాదర్ పోర్టుల సమీపంలోని అరేబియా సముద్ర జలాల్లో ఈ విన్యాసాలు జరగనున్నట్లు పాకిస్థాన్ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులతో లైవ్ ఫైరింగ్ (ఎయిర్‌టుఎయిర్ లైవ్ ఫైరింగ్) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సైనిక విన్యాసాల నేపథ్యంలో, నిర్దేశిత ప్రాంతాల్లో సాధారణ నౌకలు, విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. కరాచీ, గ్వాదర్ పోర్టులకు సమీపంలోని విన్యాసాలు జరిగే ప్రాంతానికి దూరంగా ఉండాలని వాణిజ్య నౌకలు, ఇతర విమానాలకు పాకిస్థాన్ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ఈ ఆంక్షలు రెండు రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలుస్తోంది. ఈ కసరత్తుల్లో పాకిస్థాన్ నౌకాదళం తమ యుద్ధ సంసిద్ధతను పరీక్షించుకోనుంది. ముఖ్యంగా, ఎయిర్‌టుఎయిర్ లైవ్ ఫైరింగ్ తో పాటు, యుద్ధ నౌకల నుంచి క్షిపణులను ప్రయోగించడం ద్వారా వాటి సామర్థ్యాన్ని అంచనా వేయనున్నారు. అలాగే, పాకిస్థాన్ నౌకాదళ అమ్ములపొదిలో కీలకమైన సబ్ మెరైన్ల కార్యాచరణ సామర్థ్యం, వాటి సన్నద్ధతపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పాకిస్థాన్ భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. ఈ విన్యాసాలు పాకిస్థాన్ నావికా, వాయుసేనల మధ్య సమన్వయాన్ని, అత్యాధునిక ఆయుధ వ్యవస్థల పనితీరును సమీక్షించడంలో భాగంగా జరుగుతున్నాయని తెలుస్తోంది.

---

## అరేబియా జలాల్లోకి ఐఎన్ఎస్ విక్రాంత్
# యుద్ధం తప్పదా?

**మహా:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాక్ మధ్య సంబంధాలు పూర్తి చెడిపోయాయి. ఉగ్రదాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందని భారత్ మండిపడుతోంది. ప్రతికారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఇప్పటికే పాకిస్తాన్ దౌత్య సంబంధాలు తెంచుకుంది. పాక్ దేశీయులు ఇండియా విడిచి వెళ్లాలని వీసాలు రద్దు చేసింది. సింధుజలాలపై ఆంక్షలు విధించింది. అన్ని రకాల ట్రేడింగ్స్ ను రద్దు చేసుకుంది. భారత్ నిర్ణయంతో పాకిస్తాన్ కూడా అన్ని రకాల ట్రేడింగ్స్ రద్దు చేసుకుంది. పాక్ లో ఉన్న భారతీయులను ఇండియాకు వెళ్లిపోవాలని చెప్పింది.. దీంతోపాటు యాంటీ మిస్సైల్ డిఫెండర్ అయిన ఐఎన్ఎస్ విక్రాంత్ ను అరేబియా సముద్ర జలాల్లోకి ప్రవేశపెట్టడం.. ఇదంతా చూస్తుంటే భారత్, పాక్ మధ్య యుద్ధం రాబోతుందా అంటే అవుననే తెలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అమాయకపు టూరిస్టుల ప్రాణాలు తీసిని ఏ ఒక్క టెర్రరిస్టులను, వారికి మద్దతిస్తున్న వారిని వదిలిపెట్టబోమని శపథం చేశారు.ఈ క్రమంలో సెక్యూరిటీలో కేబినెట్ కమిటీలో కూడా కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఏప్రిల్ 27 వరకు భారత్‌లో ఉన్న పాకిస్తానీయులకు డెడ్‌లైన్ విధించారు. 29 వరకు భారత్ లో ఉన్న పాకిస్తానీయులు పూర్తిగా భారత్ విడిచిపెట్టి వెళ్లిపోవాలని తెలిపింది. పాక్ లో ఉన్న భారత్ హైకమిషనర్లను ఇండియాకు రావాలని కోరింది. పహల్గామ్ దాడి తర్వాత భారతదేశం తీసుకున్న కఠిన చర్యలకు పాకిస్తాన్ అరేబియా సముద్రంలో కాల్పుల విన్యాసాలు ప్రారంభించింది. పాకిస్తాన్ చర్యకు ప్రతిస్పందనగా భారత నావికాదళం విమాన వాహక నౌక ఐఎన్ ఎస్ విక్రాంత్ సముద్రంలో దింపింది. ఐఎన్ఎస్ విక్రాంత్‌లో మిగ్ 29కె ఫైటర్ జెట్‌లు, దాడి హెలికాప్టర్లు మోహరించారు. పహల్గామ్ ఊచకోత తర్వాత భారతదేశం తీసుకున్న చర్యకు భయపడిన పాకిస్తాన్.. గ్వాదర్ ఓడరేవు సమీపంలో క్షిపణి కాల్పుల విన్యాసాలు ప్రారంభించింది. దీనికి ధీటుగా ఐఎన్ఎస్ విక్రాంత్ నావికాదళానికి చెందిన కార్వార్ నావల్ బేస్ నుంచి బయలుదేరి అరేబియా సముద్రం వైపు వెళుతున్న ఫొటోలను ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది.



**విక్రాంత్ పవర్ ఫుల్**

దేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్ 262 మీటర్ల పొడవు, 59 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. ఇది 40 యుద్ధ విమానాలను స్వయంగా మోసుకెళ్లగలదు. INS విక్రాంత్ జనరల్ ఎలక్ట్రిక్ లో శక్తివంతమైన టర్బైన్లతో అమర్చబడి ఉంది. ఈ యుద్ధనౌకలో 2 స్క్వాడ్రన్ల మిగ్ 29 ఫైటర్ జెట్‌లు ,10 క్మావ్ కా31 హెలికాప్టర్లు ఉన్నాయి. ఈ విమాన వాహక నౌక స్ట్రైక్ ఫోర్స్ పరిధి 1500 కి.మీ. ఇందులో 64 బరాక్ క్షిపణులతో ఉన్నాయి. ఇవి ఓడ నుండి నేరుగా గగనతలానికి దాడులు చేయగలవు. విక్రాంత్ దాని బలం ,సామర్థ్యాల కారణంగా ప్రపంచంలోని టాప్10 విమాన వాహక యుద్ధనౌకలలో ఒకటిగా ఉంది. ఇది ఇపుడు పరీక్షిస్తుండడంతో ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది.

---

# నీటియుద్ధానికి దారి తీస్తుంది

## భారత్‌పై పాకిస్థాన్ అక్కసు


### అంతర్జాతీయంగా పోరాడుతామంటూ ప్రకటన

### పాకిస్థాన్ కీలక భేటీలు.. కవ్వింపుకు యత్నాలు

**మహా:** సింధూ నది ఒప్పందం రద్దుపై దాయాది పాకిస్థాన్ తన అక్కసు వెళ్లగక్కింది. ఇది నీటి యుద్ధానికి దారితీస్తుందని, దీనిని చట్ట వ్యతిరేక చర్యగా అభివర్ణించింది. భారత్ నిర్ణయంపై న్యాయ బద్ధంగా ముందుకు వెళ్తామని చెప్పింది. ఈ ఒప్పందం నుంచి భారత్ తప్పుకోవడం కుదరదని, ఇందులో ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థలు పాలు పంచుకున్నాయని చెప్పింది. "సింధూ నదీ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధం. భారత్ సింధూ నది ఒప్పందాన్ని రద్దు చేసి నీటి యుద్ధాన్ని ప్రారంభిస్తుంది. ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు మధ్యవర్తిగా ఉన్న ఈ ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగే అవకాశం లేదు. ఇందులో ప్రతి నీటి చుక్క మా హక్కు. దీనిపై న్యాయంగా, రాజకీయంగా, అంతర్జాతీయంగా పూర్తిశక్తితో పోరాడుతాం." అని పాకిస్థాన్ ఇంధన మంత్రి అవాయిస్ లేగారీ ట్వీట్ చేశారు. అయితే ఏ దేశంతో కుదుర్చుకున్న ఒప్పందాన్నైనా రద్దుచేసుకునే పూర్తి హక్కు భారత్‌కు ఉంటుంది. అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒప్పందంపై భారత్ సంతకం చేయలేదు. కాబట్టి పాక్ ఏ కోర్టుకు వెళ్లినా, అంతర్జాతీయ సంస్థకు వెళ్లినా వారు ఎటువంటి తీర్పు ఇచ్చినా భారత్‌కు వర్తించదు. మరోవైపు పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ స్పందించారు. భారత్ తమపై చేస్తున్న ఆరోపణలు నిరాధరమైనవని చెప్పారు. ఒకవేళ భారత్ వద్ద ఏదైనా ఆధారాలు ఉంటే చూపెట్టాలని తెలిపారు. మోదీ ప్రభుత్వ నిర్ణయాలకు బదులు ఇస్తామని చెప్పినట్లు పాకిస్థాన్ స్థానిక మీడియా పేర్కొంది. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్‌పై బురద జల్లుతుందని మంత్రి అక్కడి మీడియాతో చెప్పారు.

**పాకిస్థాన్ కీలక భేటీ**

మరోవైపు భారత్ తీసుకున్న నిర్ణయాలపై చర్చించేందుకు పాకిస్థాన్ గురువారం కీలక సమావేశం నిర్వహించింది. ఇస్లామాబాద్‌లో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జాతీయ భద్రతా కమిటీ సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు, పాక్ సైన్యానికి చెందిన ఉన్నతాధికారులు, భద్రతా కమిటీ సభ్యులు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



భారత నిర్ణయాలకు వ్యతిరేకంగా పాకిస్థాన్ విదేశాంగ శాఖ చేసిన ప్రతిపాదనలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ పరిణామాలపై చట్టపరంగా ముందుకెళ్లే అంశాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. తాజాగా ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును భారత్ నిలిపివేసింది. దీంతో దాయాది పాకిస్థాన్‌కి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడగా, అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభిస్తుంది. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తుండడం వల్ల భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు

---

# పాకిస్తాన్ బందీగా భారత జవాన్

## సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ జవాన్‌ను బంధించిన పాక్

### జవానును తక్షణమే విడుదల చేయాలని భారత్ డిమాండ్.. బోర్డర్ లో హై టెన్షన్

**ఢిల్లీ, మహా:** పహల్గాం ఉగ్రదాడి ఘటనతో భారత్‌పాక్ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. భారత జవానును పాకిస్తాన్ బందీగా చేసుకుంది. భారత్, పాక్ సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ జవాన్‌ను పాక్ బంధించింది. తమ భూభాగంలోకి ప్రవేశించాడని పాక్ ఆరోపించింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా బంధించడంపై భారత్ మండిపడింది. బుధవారం ఫిరోజ్‌పూర్ బోర్డర్ దగ్గర 182వ బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పీకే సింగ్ ప్రమాదవశాత్తూ బోర్డర్ దాటాడు. పాకిస్తాన్ రేంజర్లు బీఎస్ఎఫ్ జవాన్ పీకే సింగ్ ను బంధించారు. ఆ సమయంలో పీకే సింగ్ బీఎస్ఎఫ్ యూనిఫాం ధరించి సర్వీస్ రైఫిల్‌తో ఉన్నారు. సరిహద్దు అవతల పొలం పనులు చేసుకుంటున్న రైతులకు తోడుగా ఉన్న పీకే సింగ్ ఒక చెట్టు కింద నీడలో కూర్చుని ఉండగా పాక్ రేంజర్లు ఆయనను బంధించారు. పీకే సింగ్ నిర్బంధంపై సరిహద్దులోని భద్రతా దళాల మధ్య సమావేశం




కొనసాగుతోంది. బీఎస్ఎఫ్ జవానును తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని భారత్ స్పష్టం చేసింది. పహల్గాం ఘటన తర్వాత జరిగిన పరిణామాలతో భారత జవాను నిర్బంధం చర్చనీయాంశమైంది. ఏప్రిల్ 23న సాయంత్రం జవానును పాక్ నిర్బంధించింది.

---

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అమిత్ షా, జైశంకర్ కీలక భేటీ

## పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాక్ సంబంధాలు తీవ్ర ఉద్రిక్తం

- సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు, పాక్ పౌరులకు వీసాలు నిలిపివేత
- ప్రతిగా భారత విమానాలకు పాక్ గగనతలం మూసివేత
- రాష్ట్రపతి ముర్ముతో హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ
- జీ 20 దేశాల రాయబారులతో భారత విదేశాంగ శాఖ సంప్రదింపులు



**మహా :** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కేంద్ర మంత్రులు అమిత్ షా, జైశంకర్ కలిశారు. పహల్గాం ఉగ్రదాడి, భారత్ చర్యల నేపథ్యంలో రాష్ట్రపతితో భేటీ అయిన కేంద్ర మంత్రులు దేశభద్రత, పాక్ దౌత్యపరమైన చర్యలపై కీలక చర్చలు జరిపారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడి ఘటన భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలను తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ దాడిలో 26 మంది అమాయక భారతీయులను ఉగ్రవాదులు బలిగొన్న ఘటనపై భారత ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతిస్పందనగా పాకిస్థాన్‌తో కీలకమైన సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు బుధవారం ప్రకటించిన కేంద్రం, పాకిస్థాన్ జాతీయులకు అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు గురువారం వెల్లడించింది. భారత్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయాలకు పాకిస్థాన్ కూడా ప్రతిచర్యలకు దిగింది. భారత విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించకుండా నిషేధం విధించింది. ఇరు దేశాలు తీసుకుంటున్న ఈ నిర్ణయాలతో సరిహద్దుల్లోనూ, దౌత్యపరంగానూ ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతర పరిణామాలు, ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి రాష్ట్రపతికి వివరించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన చిత్రాన్ని రాష్ట్రపతి భవన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు.

**దౌత్యపరమైన చర్యలు**

మరోవైపు, పహల్గాం ఉగ్రదాడి ఘటనపై అంతర్జాతీయ సమాజానికి వివరించే ప్రయత్నాల్లో భాగంగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. చైనా, కెనడా సహా పలు జీ20 దేశాలకు చెందిన రాయబారులతో విదేశాంగ శాఖ అధికారులు సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో ఉగ్రదాడికి సంబంధించిన వివరాలు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి వివరించినట్లు తెలుస్తోంది.

# గట్టిగా జవాబివ్వండి

## కేంద్ర ప్రభుత్వ చర్యలకు పూర్తి మద్దతు

### అఖిలపక్ష భేటీలో ఖర్గే, రాహుల్.. నేడు జమ్మూకశ్మీర్‌లో రాహుల్‌గాంధీ పర్యటన



**ఢిల్లీ, మహా:** ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడిపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ''జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారు'' అని కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ సముదాయంలోని భవనంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు.

**ప్రభుత్వ చర్యలకు పూర్తి మద్దతు**

ప్రభుత్వ చర్యలకు మద్దతు ఉంటుందని లోక్ సభలో ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ చెప్పారు. కాశ్మీర్‌లో శాంతి నెలకొనాలని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. ఈ ఉగ్రదాడిని అఖిలపక్షం తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన 26 మందికి అఖిలపక్షం నివాళులు అర్పించింది. జమ్మూకశ్మీర్‌లో రాహుల్‌గాంధీ నేడు పర్యటించబోతున్నారు.

# బీహార్ లో హిందీలో ప్రసంగిస్తూ.. ఒక్కసారిగా ఇంగ్లీషులోకి మారిన మోదీ

## భారతదేశం యొక్క దృఢ సంకల్పాన్ని ప్రపంచానికి చెప్పిన మోదీ



**మహా:** పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీహార్‌లోని మధుబనిలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని ఏమాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని కఠిన స్వరంతో హెచ్చరించారు. అయితే, ఈ హెచ్చరికను జారీ చేసే క్రమంలో ప్రధాని మోదీ అనుసరించిన వైఖరి ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఉద్వేగంగా హిందీలో ప్రసంగిస్తున్న ఆయన, కీలకమైన హెచ్చరిక సమయంలో ఒక్కసారిగా ఇంగ్లీషులో మాట్లాడారు. హిందీలో ప్రసంగాన్ని కొనసాగిస్తూ, పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని, బాధ్యులైన వారిని శిక్షిస్తామని చెబుతున్న ప్రధాని మోదీ, అకస్మాత్తుగా తన ప్రసంగ భాషను మార్చారు. "ఈ రోజు, బీహార్ గడ్డ పైనుంచి యావత్ ప్రపంచానికి నేను చెబుతున్నాను" అంటూ ఆయన ఇంగ్లీషులో మాట్లాడటం ప్రారంభించారు. ప్రతి ఉగ్రవాదిని, వారికి అండగా నిలిచే వారిని భారత్ గుర్తిస్తుంది, వారి జాడ కనిపెడుతుంది మరియు శిక్షిస్తుంది. వారిని భూమి చివర వరకైనా వెంటాడుతాం అని మోదీ స్పష్టమైన ఆంగ్లంలో, తీవ్ర స్వరంతో పేర్కొన్నారు. సాధారణంగా దేశ ప్రజలను ఉద్దేశించి హిందీలో ఎక్కువగా ప్రసంగించే ప్రధాని, అంతర్జాతీయ ఉగ్రవాదంపై హెచ్చరిక చేసే సమయంలో ఇంగ్లీషు భాషను ఎంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందేశం కేవలం దేశ ప్రజలకే కాకుండా, యావత్ ప్రపంచానికి, ముఖ్యంగా ఉగ్రవాదానికి మద్దతిస్తున్న శక్తులకు సూటిగా, ఎలాంటి అస్పష్టత లేకుండా చేరాలనే ఉద్దేశ్యంతోనే ప్రధాని భాష మార్చి ఉంటారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది ఉగ్రవాదంపై పోరులో భారతదేశం యొక్క దృఢ సంకల్పాన్ని అంతర్జాతీయ వేదికపై మరోసారి బలంగా వినిపించే ప్రయత్నంగా కనిపిస్తోందని వారు తెలిపారు. ఆ తర్వాత తిరిగి హిందీలోకి మారిన మోదీ, "ఉగ్రవాదం వల్ల భారతదేశ స్ఫూర్తి ఎప్పటికీ దెబ్బతినదు... ఉగ్రవాదం శిక్షార్హమైనది. న్యాయం జరిగేలా చూసేందుకు ప్రతి ప్రయత్నం జరుగుతుంది. యావత్ దేశం ఈ సంకల్పంతో దృఢంగా ఉంది" అని ఉద్ఘాటించారు.

# భారత్ దెబ్బకు కుదేలవుతున్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ

## కరాచీ స్టాక్ మార్కెట్ కుదేలు

### పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ కీలక దౌత్య, భద్రతాపరమైన చర్యలు
### సింధు జలాల ఒప్పందం రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత
### పాకిస్తాన్ క్షిపణి పరీక్ష నిర్వహణ... భారత్ నుంచి తీవ్ర హెచ్చరికలు

**మహా :** భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర రూపం దాల్చిన ఉద్రిక్తతలు పాకిస్తాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. గురువారం నాడు ట్రేడింగ్‌లో కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్ కీలక సూచీ కెఎస్ఈ 100 భారీగా పతనమైంది. పాక్ స్టాక్ మార్కెట్ దాదాపు 2 శాతం నష్టపోయింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్తాన్‌కు ఈ పరిణామం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన ఘటన అనంతరం భారత్ కఠిన వైఖరి అవలంబించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన భేటీ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడంతో పాటు, ఇరు దేశాల్లోని దౌత్య సిబ్బందిని గణనీయంగా తగ్గించాలని, పాక్ మిలిటరీ అటాషెలను బహిష్కరించాలని నిర్ణయించింది. పాక్ జాతీయులకు సార్క్ వీసా మినహాయింపు పథకాన్ని నిలిపివేసింది. మే 1వ తేదీలోగా చట్టబద్ధంగా తిరిగి వచ్చేవారు మినహా, తక్షణమే అట్టారీ సరిహద్దును మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్ చర్యలకు ప్రతిస్పందనగా పాకిస్తాన్ నేడు కరాచీ తీరంలో క్షిపణి పరీక్ష నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. భారత్‌లోని





ప్రధాన నగరాలకు చేరగల సామర్థ్యం ఉన్న షహీన్ III లేదా బాబర్ క్షిపణిని పరీక్షించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇదే సమయంలో భారత్ కూడా తన సరికొత్త గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ నుంచి మీడియం రేంజ్ సర్ఫేస్‌టుఎయిర్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగానే మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతిన్నదని ఆరిఫ్ హబీబ్ లిమిటెడ్‌కు చెందిన సనా తౌఫిక్, తదితర విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ ద్రవ్య నిధి పాకిస్తాన్ వృద్ధి రేటు అంచనాలను 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 3 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గించడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచిందని నిపుణులు పేర్కొన్నారు.

# నిఘా వ్యవస్థ బీజేపీ కోసమే

## పహల్గామ్‌లో ఉగ్రదాడిపై తీవ్రంగా స్పందించిన షర్మిల

**మహా:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడి ఘటనపై వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యమేనని ఆమె ఆరోపించారు. ఈ దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారని, పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేశారని షర్మిల గుర్తుచేశారు. ఏటా కోట్లాది మంది పర్యాటకులు సందర్శించే కశ్మీర్ వంటి సున్నితమైన




ప్రాంతంలో భద్రతా లోపం ఎందుకు తలెత్తిందని ఆమె ప్రశ్నించారు. "పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుంటే అక్కడ కనీస భద్రతా సిబ్బంది లేకపోవడం దారుణం. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే. ఇంతమంది ప్రాణాలు కోల్పోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం" అని షర్మిల పేర్కొన్నారు.

# నెహ్రూ స్ఫూర్తితో భారత్ సమ్మిట్

## 100 దేశాల నుండి 450మంది ప్రతినిధులు

### నేటి నుండి ప్రతిష్టాత్మకంగా సదస్సు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




(మొదటిపేజీ తరువాయి)

ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం'' అని మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 100కి పైగా దేశాల నుండి 450 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొంటున్నారు. అహింస, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి కాంగ్రెస్ పార్టీ మూల సూత్రాలపై దృష్టి సారించి, నెహ్రూ గారి నాన్‌అలైన్‌మెంట్ ఉద్యమ స్ఫూర్తిని ఆధారంగా తీసుకుని, ఈ సమ్మిట్ ప్రపంచ సమస్యలపై చర్చకు వేదికగా నిలవనుంది. రాహుల్ గాంధీ ఆలోచనల ప్రకారం, ప్రపంచానికి భారత్ నేతృత్వాన్ని ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ఈ సమ్మిట్ ద్వారా ప్రజాస్వామ్య విలువలకు మళ్లీ జీవం పోసే ప్రయత్నం జరుగుతుంది అని భట్టి వివరించారు. ఏర్పాట్లను భట్టి విక్రమార్కతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సదస్సుకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, ఖర్గే, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్ హాజరయ్యే అవకాశాలున్నాయి.

**కార్యక్రమాలు ఇలా**

- ఉదయం 7.30కు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన ఎలా జరుగుతోంది అనే అంశంపై క్షేత్రస్థాయిలో అవగాహన.
- ఉదయం 10.30 నుండి లింగ సమానత్వం, మహిళా హక్కులపై చర్చ, మధ్యాహ్నం సమాచార వాస్తవాలు అపోహలపై చర్చ.
- మధ్యాహ్నం 2.45కు యువత భవిష్యత్తు రాజకీయాల్లో పాత్రపై చర్చ. తర్వాత కొత్త ప్రపంచ కూటముల దిశగా చర్చ.
- తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రెజెంటేషన్. అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై రాష్ట్ర విజన్ పంచడం.
- 26న విభేదాలను అధిగమించేందుకు సమ వైభవంపై చర్చ, వాతావరణ న్యాయం, ఆర్థిక న్యాయం అనిశ్చిత కాలంలో ఎలా సాధించాలో చర్చ, శాంతి, న్యాయం, మరియు బహుళ ధ్రువ ప్రపంచంలో వాటి ప్రాధాన్యం, ముగింపు సదస్సు, తర్వాత ఇందిరా మహిళాశక్తి బజార్ సందర్శన. మహిళల స్వయం సహాయక సంఘాల బజార్ సందర్శన, కార్యకలాపాల పరిచయం.

# పహల్గామ్ ఉగ్రదాడి వేళ

## ముస్లింలకు అసదుద్దీన్ ఓవైసీ కీలక పిలుపు.. నల్లరిబ్బన్ ధరించండి

**మహా:** హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ.. పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్ర స్థాయిలో ఖండించారు. ఈ క్రమంలోనే ముస్లింలకు అసదుద్దీన్ ఓవైసీ కీలక సూచనలు చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. అందులో ''మీ అందరికీ తెలిసినట్లుగా పాకిస్తాన్ గడ్డపైన ఉన్న లష్కరే తోయిబా ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో కాల్పులు జరిపి 26 మంది పర్యాటకుల ప్రాణాలను బలి తీసుకున్నారు. ఈ ఉగ్రవాద చర్యను ఖండిస్తూ.. మీరు రేపు ప్రార్థనలకు వెళ్లినప్పుడు, దయచేసి మీ చేతికి నల్ల రంగు రిబ్బన్ ధరించండి'' అని వీడియోను విడుదల చేశారు.




# ఇది కశ్మీర్‌పై జరిగిన దాడి మా రక్తం మరిగిపోతుంది

### పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండించిన నటుడు ప్రకాశ్ రాజ్
### ఇది అమాయకులపైనే కాదు, కశ్మీర్‌పై జరిగిన దాడిగా అభివర్ణన
### నిజమైన కశ్మీరీలు హంతకులు కాదని, ఈ చర్య సిగ్గుచేటని వ్యాఖ్య
### బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతూ... సంఘీభావం ప్రకటన

**మహా :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి ఘటనపై ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యతో తమ రక్తం మరిగిపోతోందని అన్నారు. ఈ దారుణ మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఓ సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. ఈ దాడి కేవలం అమాయకులపై జరిగిన దాడి మాత్రమే కాదని, మొత్తం కశ్మీర్‌పై, కశ్మీరీల ఆతిథ్యంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ ఘటన ప్రతి కశ్మీరీ హృదయాన్ని ముక్కలు చేసిందని, మాటలు రావడం లేదని ప్రకాశ్ రాజ్ తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు. అంతులేని బాధతో ఈ పోస్ట్ రాస్తున్నట్లు పేర్కొన్నారు. "మన ఇంటికి వచ్చిన అమాయక అతిథులను దారుణంగా కాల్చి చంపారు. మన ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించడానికి వచ్చిన పర్యాటకులు భయానక స్థితిని ఎదుర్కొన్నారు. ఈ అనాగరిక దాడి శతాబ్దాల సంప్రదాయాలకు జరిగిన అవమానం, మన విశ్వాసాన్ని దెబ్బతీసే దుష్ట చర్య" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దుశ్చర్యకు సిగ్గుపడుతున్నామని, తమ రక్తం మరిగిపోతోందని ప్రకాశ్ రాజ్ తెలిపారు. "ఇలాంటివి జరిగిన ప్రతిసారి, అవమాన భారాన్ని మోయాల్సి వస్తోంది. దీన్ని అస్సలు క్షమించలేం. ఇది భయంకరమైన, పిరికిపంద చర్య" అని ఆయన అన్నారు. కశ్మీరీలు మౌనం వీడి, ఈ క్రూరమైన చర్యను ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. "ఇది నిజమైన కశ్మీరీలు చేసింది కాదు. మా తల్లిదండ్రులు హంతకులను పెంచలేదు. ఇలాంటి చర్యలకు ఎలాంటి సమర్థన లేదు. ఇది కేవలం సిగ్గుపడాల్సిన



అంశం" అని ప్రకాశ్ రాజ్ స్పష్టం చేశారు. ఈ దాడి వెనుక ఉగ్రవాదుల ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదని, వారి చర్య కొన్ని కుటుంబాలను నాశనం చేసి, పిల్లలను అనాథలుగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కశ్మీర్‌ను ఆటస్థలంగానో, యుద్ధ క్షేత్రంగానో చూడవద్దని ఆయన హితవు పలికారు. అతిథులను గౌరవించే ప్రదేశం కశ్మీర్ అని గుర్తుచేశారు. చివరగా, దాడిలో బాధితులైన కుటుంబాల బాధ తమ అందరిదని పేర్కొంటూ వారికి సంఘీభావం ప్రకటించారు. "మీరు కశ్మీర్‌లో ప్రశాంతంగా ఉండటానికి వచ్చారు. కానీ, మేము దానిని కాపాడలేకపోయాం. అందుకు క్షమించమని అడుగుతున్నాం" అంటూ ప్రకాశ్ రాజ్ తన పోస్ట్‌ను ముగించారు.



# ఇది కేవలం శాంపిల్ మాత్రమే..

## భారత క్షిపణి పరీక్షతో పాక్‌కు హెచ్చరిక జారీ!


**మహా:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. దీంతో దేశమంతా పాక్ మీద కోపంతో ఊగిపోతుంది. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య, భారత్ తన సత్తాను మరోసారి చాటింది. అరేబియా సముద్రంలో భారత నౌకాదళం చేపట్టిన క్షిపణి పరీక్ష సక్సెస్ అయింది. శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించే విధంగా, స్వదేశీ టెక్నాలజీతో తయారైన మిస్సైల్ విధ్వంసక క్షిపణిని ఐఎన్ఎస్ సూరత్ యుద్ధ నౌక నుంచి విజయవంతంగా పరీక్షించింది. సరిహద్దుల్లో కయ్యానికి కాలుదువ్వుతున్న వారికి ఇది గట్టి హెచ్చరికగా నిలుస్తోంది. వెరీ బ్యాడ్ ఆరెంజ్ ఆర్మీ పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ దాడి తర్వాత దేశంలో భద్రతాపరమైన ఆందోళనలు నెలకొన్నాయి. భారత్ తీసుకుంటున్న చర్యలతో పాకిస్తాన్‌లో సైతం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమయంలోనే పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు దిగింది. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులను పరీక్షించనున్నట్లు ప్రకటించింది. కరాచీ తీర ప్రాంతంలో రెండు రోజుల పాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలిపింది. తీరం పంచుకుంటున్నందున ఈ సమాచారాన్ని భారత్‌కు కూడా తెలియజేసింది. పాకిస్తాన్ చర్యలకు దీటుగా, భారత్ తన రక్షణ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ సూరత్ యుద్ధ నౌక నుంచి క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది ఒక మిస్సైల్ విధ్వంసక క్షిపణి కావడం విశేషం. ఈ క్షిపణి సముద్రంపై తక్కువ ఎత్తులో ప్రయాణించే లక్ష్యాలను సైతం ఛేదించగలదు. ఈ విజయం భారత నౌకాదళ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ నౌకలను రూపొందించడం, నిర్మించడం, అభివృద్ధి చేయడంలో భారత నౌకాదళానికి ఎవరూ సాటిలేరని ఈ ప్రయోగం మరోసారి రుజువు చేసింది. సరిహద్దులను కాపాడుకోవడంలో భారతదేశం అచంచలమైన నిబద్ధతకు, ఆత్మనిర్భర్ భారత్‌కు ఇది ఒక గొప్ప ఉదాహరణ అని నౌకాదళం పేర్కొంది.

# కేసీఆర్ సభ విజయవంతం అవుతుంది

## కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు ఆసక్తిగా ఉన్నారు

### గచ్చిబౌలి భూములపై స్మితా సబర్వాల్ ట్వీట్‌లో తప్పేం లేదు
### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు

**మహా :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగెందర్ తన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు. కేసీఆర్ బహిరంగ సభ, కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్మితా సబర్వాల్ చేసిన రీట్వీట్‌పై ఆయన స్పందించారు. బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు తలపెట్టిన సభ విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూసేందుకు ప్రజలు ఆసక్తిగా ఉన్నారని, ఆయన సభకు పెద్ద సంఖ్యలో జనం హాజరవుతారని దానం అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన ట్వీట్‌ను దానం నాగేందర్ సమర్థించారు. ఆమె ట్వీట్‌లో ఎలాంటి తప్పు లేదని, ఆమె వాస్తవాన్నే పేర్కొన్నారని అన్నారు. ఆ ట్వీట్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేసినట్లుగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే భూముల విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై తీవ్రంగా స్పందించిందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భూముల విషయంలో పునరాలోచన చేస్తుందని దానం వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ కొన్నిరోజుల క్రితం ఒక యూట్యూబ్ ఛానల్లో మాట్లాడుతూ కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. మరోవైపు తెలంగాణ సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎల్కతుర్తి సమీపంలో దాదాపు 1,250 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణం, పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు. సుమారు 40 నుంచి 50 వేల వాహనాలు వచ్చినా ఎటువంటి ఇబ్బంది లేకుండా సభా స్థలికి నలువైపులా ప్రత్యేక పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేశారు.



# పర్యావరణంపై ఆ కుటుంబానికి ప్రత్యేక శ్రద్ధ...


## తాత అడుగుజాడల్లో మనవరాలు

పద్మశ్రీ వనజీవి రామయ్య దశదినకర్మ సందర్భంగా మూడువేల మొక్కలు, జ్యూట్ బ్యాగులు అందించిన బొడ్డుపల్లి రమేష్ గౌతమి దంపతులు మూడువేల పండ్ల మొక్కలతోపాటు జూట్ బ్యాగులను పద్మశ్రీ మన జీవి రామయ్య మనవరాలు బొడ్డుపల్లి గౌతమి రమేష్ అందించారు. ఇటీవల పద్మశ్రీ వనజీవి రామయ్య గుండెపోటుతో మృతి చెందగా ఆయన దశాదినకర్మను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మనవరాలు బొడ్డుపల్లి గౌతమి రమేష్ తాత పర్యావరణహితంపై చూపిన శ్రద్ధను కొనసాగింపుగా మూడువేల జ్యూట్ బ్యాగులను, పండ్ల పూల మొక్కలను అక్కడికి వచ్చిన వారికి అందించారు. దశాదినకర్మకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ మొక్కలను తీసుకొని సంతోషం వ్యక్తం చేశారు. పర్యావరణంపై ఆ కుటుంబానికి ఉన్న శ్రద్ధను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయ ప్రముఖులు అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.



# యుద్ధం జరిగితే.. భారత్ దమ్మెంత?

## పాకిస్థాన్‌పై ఎంతకాలం పోరాడాలి?



(మహా ప్రత్యేకం):
ఇండియా -పాకిస్తాన్‌లు ఇపుడు దేనికైనా సై అంటున్నాయి. సింధుజలాల ఒప్పదం రద్దుతో పాకిస్థాన్ తోక తొక్కిన పాములా బుసలు కుడుతోంది. అమెరికా చైనా ట్రేడ్ వార్ తరహాలో భారత్ పాకిస్థాన్ మధ్య ఉగ్రవార్ సాగుతోంది. పహల్గాం దురాగత దాడికి ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ కసిగా ఉంది. ఉగ్ర మూకల ఏరివేతకు పాకిస్థాన్ సహకరించని పరిస్థితి నెలకొనడంతో పాటు మేం దేనికైనా రెడీ అంటూ ప్రతీకార చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధం అనివార్యమవుతుందా అన్న చర్చ జరుగుతోంది. మాటకు మాట.. చర్యకు చర్యతో భారత్ పై పాకిస్థాన్ కస్సుబుస్సులాడుతోంది.
ప్రపంచవ్యాప్తంగా సైనిక బలాన్ని ర్యాంక్ చేసే ప్రసిద్ధ సంస్థ అయిన గ్లోబల్ ఫైర్‌పవర్ ప్రకారం, భారతదేశంలో దాదాపు 1.44 మిలియన్ల మంది క్రియాశీల సైనిక సిబ్బంది ఉన్నారు. ఇది ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సైన్యం. ఈ నేపథ్యంలో ఒక వేళ యుద్ధంలో ఇరు దేశాలు తలపడితే, పాకిస్తాన్ సైన్యం భారతదేశానికి వ్యతిరేకంగా ఎన్ని రోజులు నిలబడగలదోనన్న చర్చ జరుగుతోంది.

### భారతదేశపు సైనిక శక్తి

భారతదేశం దాదాపు 1.44 మిలియన్ల మంది క్రియాశీల సైనిక సిబ్బందిని కలిగి ఉంది. పాకిస్తాన్ సైన్యం భారత్ సైనిక పరిమాణంలో సగం కంటే తక్కువ. భారతదేశం చాలా పెద్ద పారా మిలిటరీ దళాన్ని కలిగి ఉంది. భారత్‌కు 4,500 యుద్ధ ట్యాంకులు, 538 యుద్ధ విమానాలు, ఆధునిక ఆయుధాలు.. ఇంకా భారీ క్షిపణి వ్యవస్థ ఉంది. గ్లోబల్ ఫైర్‌పవర్ ప్రకారం, భారతదేశ సైనిక బలం స్కోరు 0.1025 ఉండగా, పాకిస్తాన్ 0.1695(ఈ స్కోర్ ఎంత తక్కువ ఉంటే అంత సామర్థ్యం ఉన్నట్టు లెక్క) ఈ రేషియోలో భారత్ పాక్‌ల మధ్య చాలా అంతరం ఉంది.

### భారత భూతల సైన్యం...

- 1.44 మిలియన్ల క్రియాశీల దళాలు
- 1.15 మిలియన్లు రిజర్వ్‌లో ఉన్నాయి
- 25 లక్షలకు పైగా పారామిలిటరీ దళాలు ఉన్నాయి

### భూమిపై, భారతదేశ సైన్యం అధునాతన యుద్ధ సామగ్రిని కలిగి ఉంది:

- అర్జున్ మెయిన్ బాటిల్ ట్యాంకులు
- టి-90 'భీమ్' ట్యాంకులు
- పినాకా మల్టీ-బారెల్ రాకెట్ లాంచర్లు
- బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు
- హోవిట్జర్లు, ఇతర ఆధునిక ఫిరంగి దళాలు భారత్‌కు ఉన్నాయి

భారత సైన్యం కేవలం సంఖ్యల పరంగానే కాకుండా బలమైన సాంకేతికత, తయారీ, వ్యూహాత్మక స్థానాల్లో కూడా బాగా మెరుగ్గా ఉంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, రెండు దేశాలకు శక్తివంతమైన సైన్యాలు ఉన్నప్పటికీ, భారతదేశ సైన్యం మూడు దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళం చాలా పెద్దది మరియు అధునాతనమైనది. పూర్తి సన్నద్ధతో ఉన్న భారత సైనిక సామర్థ్యం ముందు పాకిస్తాన్ ఎంతో కాలం నిలబడలేదన్నది ఫైర్‌పవర్ సంస్థ అంచనా. కానీ పాకిస్థాన్ మాత్రం భారత్ కంటే ముందుగా యుద్ద సన్నద్ధ పరీక్షలు మొదలుపెట్టడంపై విస్మయం వ్యక్తమవుతోంది.



### 72వ రాజ్యాంగ సవరణ హక్కులు

# స్థానిక సంస్థలకు కల్పించాలి

**ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం**

**రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో స్థానిక సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక పెద్ద అడుగని, ఇది స్థానిక సమూహాలు, తమ సంఘాల గురించి నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రజాస్వామ్యాన్ని మరింత చురుగ్గా చేస్తుంది పేర్కొన్నారు. గ్రామాలలో నెలోకొన్న సమస్యలు పరిష్కరించుకోవడానికి గ్రామసభలు వేధికలని అన్నారు. 72 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పొందుపరిచిన హక్కులు స్థానిక సంస్థలకు కల్పించాలని కోరారు. ప్రత్యేక పాలనలో గ్రామాలలో సమస్యలను పరిష్కరిస్తున్న అమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి లాలయ్య, కార్యదర్శి అల్లాజి, ఎన్ఐఆర్డిపిఆర్ ప్రతినిధి నిధిసింగ్ లను జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు భిక్షపతి, డోనాదుల మహేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు వెంకటయ్య గౌడ్, నాయకులు ఛందోజి, రమేష్, రవి, శ్రీశైలం, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హిడ్మా దళం కోసం వేట

**భద్రతా బలగాల వలయంలో కర్రె గుట్టలు**

**ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి**
**ఒక జవాన్ కి గాయాలు..ఆస్పత్రికి తరలింపు**





**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఆయన దళం కోసం ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో భారీ యాంటీనక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపుర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. భారీగా మావోయిస్టులు కర్రెగుట్టల వద్ద ఉన్నారనే సమాచారంతో భద్రతా సిబ్బంది భారీగా చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారని సమాచారం. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బీజాపుర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. గాలింపు చర్యల్లో డీఆర్జీ బస్తర్ ఫైటర్స్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. మూడు రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 3 వేల మందితో కూంబింగ్ చేపట్టగా.. గురువారం అదనంగా మరో 2 వేల మంది భద్రతా బలగాలను రప్పించారు. దీంతో ఈ 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. అయితే, భద్రతా బలగాల సంఖ్య 20వేల వరకు ఉంటుందని పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బస్తర్, అబూజ్‌బడ్ దండకారణ్యంపై హిడ్మాకు పూర్తి అవగాహన ఉండడంతో అతడిని టార్గెట్‌గానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. హిడ్మాతో పాటు మావోయిస్టు బెటాలియన్ చీఫ్ దేవాను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. దేశ చరిత్రలోనే అతి పెద్ద ఆపరేషన్ గా కర్రె గుట్టల ఆపరేషన్ అని చెప్పవచ్చు. పి ఎల్ జి ఏ బెటాలియన్ కు చెందిన కీలక మావోయిస్టులు నేత ఒకరు మృతి చెందారని సమాచారం.

**ముగ్గురు మావోయిస్టుల మృతి చెందారు: బస్తర్ ఐ జి సుందర్ రాజ్**



ఛత్తీస్ ఘడ్ బీజాపూర్ జిల్లా పరిధిలోని కర్రె గుట్టల వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టుల మృత దేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐ.జి పి.సుందర్ రాజ్ తెలిపారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆపరేషన్ కొనసాగుతోందని..డిఆర్జి, కోబ్రా, ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్ టీమ్స్ పాల్గొన్నాయన్నారు. భారీగా ఆయుధాలు, పేలుడు సామాగ్రి తో పాటు మావోయిస్టుల సామాన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్... కొందుర్గులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం, పేదల ప్రభుత్వమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా, కొందుర్గు మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని నేడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. రైతుకు క్వింటాలకు 2320 రూపాయలతో గిట్టుబాటు ధరతో పాటు, ప్రభుత్వం అదనంగా 500 రూపాయలు బోనస్ ను ఇస్తుందన్నారు. రైతు కష్టానికి ప్రభుత్వం ప్రతిఫలం అందజేస్తున్నారు. రైతులు బయట మార్కెట్లో దళారులను నమ్మి మోసపోవద్దని, వరి ని బయట మార్కెట్లో అమ్ముకోవద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సకాలంలో డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని పేదల కోసం రేషన్ షాపుల్లో సన్నబియ్యంగా అందజేస్తున్న గొప్ప ఆలోచన రేవంత్ రెడ్డిది అన్నారు. అనంతరం కొందుర్గు లో నూతనంగా నిర్మించబోయే మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు.

### 27వ భూపాలపల్లిలో

# మెగా జాబ్ మేళా

**ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి**
**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీన పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో జరిగే మెగా జాబ్ మేళా కార్యక్రమానికి వచ్చే యువతకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఏర్పాట్లుపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, పరిశ్రమ లు, వైద్య, విద్య, రెవిన్యూ, సింగరేణి, జెన్కో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి సుమారు పదిహేను వేల మంది నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వివిధ శాఖల జిల్లా అధికారులకు ఏర్పాట్లుపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఆన్లైన్ ద్వారా 7,624 మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం ఏర్పాటు తో పాటు మంచి నీరు, మజ్జిగ, అల్పాహారం తదితర ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్ప గ్రాండ్ లో మంచినీరు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సింగరేణి జీఎంకు సూచించారు. ఎందరో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ మహోన్నత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా భావించి అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉపాధి లభించక చదువుకున్న యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని వారిని సన్మార్గంలో నడిపంచాల్సిన భాద్యత మనందరిపై ఉందని, యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అవుతారని సూచించారు. వేసవి దృష్ట్యా అత్యవసర మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ ఏర్పాటుతో పాటు ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర బెడ్లు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకి సూచించారు. కొంతమంది ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారి కోసం అదే రోజు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. అందుకు కంపెనీల వారీగా ఖాళీలను తెలిపే విధంగా పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. టాస్క్ కంపెనీ ప్రతినిధులు ఒకరోజు ముందుగానే హైదరాబాద్ నుండి భూపాలపల్లికి వచ్చే అవకాశం ఉన్నందున సింగరేణి, జెన్కో అధికారులు వారికి వసతితో పాటు భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు.

# మహా ఎండలు

**ఇక రెండురోజులు.. కుతకుతే.. గరిష్ట ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న జనం**

**హైదరాబాద్:** తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 23 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. నేడు, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

# తుదిదశలో కాళేశ్వరం విచారణ

**మేలో నివేదిక**

**మహా:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల నిర్మాణాల అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తుది దశ విచారణ మొదలు పెట్టింది. ఇప్పటికే అధికారులు, నిర్మాణ సంస్థలు, నిపుణులను ప్రశ్నించిన కమిషన్ దాని ఆధారంగా 300 పేజీలకు పైగా నివేదికను సిద్ధం చేసినట్లు తెలిసింది. దాదాపు 90 శాతం రిపోర్టు పూర్తిచేసిన కమిషన్ ఎన్‌డీఎస్ఏ ఫైనల్ రిపోర్టు కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు తది నివేదిక కోసం ఎన్డీఎస్ఏ కు మరోసారి లేఖ రాసింది. ఆ నివేదిక మరో మూడు వారాల్లో వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఫైనల్ రిపోర్టును అందజేయనుంది.

### రూపాయికి ఇడ్లీ వస్తుందో రాదో కానీ..

# ఎకరా భూమి ఇచ్చేశారు

**మూడు వేల కోట్ల విలువైన భూములు దోచి పెడుతున్నారు.. జగన్ సంచలన వ్యాఖ్యలు..!!**

**విశాఖ, మహా:** విశాఖలో ఉర్సాకు భూముల కేటాయింపు పైన వైసీపీ అధినేత జగన్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ, ఉర్సా లాంటి కంపెనీలకు మాత్రం మూడు వేల కోట్ల విలువైన భూములు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. విశాఖలో లులూ వంటి వాటికి ఎలాంటి టెండర్లు లేకుండా రూ 1500 కోట్ల విలువైన భూములు ఇస్తున్నారని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ దోచుకుంటున్నారని విమర్శించారు. అమరావతి నిర్మాణంలోనూ అవి నీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. అమరావతిలో పనుల రేట్లు పెంచేసి.. వాళ్లేటెండర్లు రింగ్ ఫార్మ్ చేసి వాళ్ల కాంట్రాక్టర్లకే ఇచ్చుకుంటున్నారని చెప్పుకొచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇస్తున్నారని మండిపడ్డారు. పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇస్తూ అందులో ఎనిమిది శాతం తీసుకొంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేసిన అప్పులన్నీ ఎక్కడకు పోతున్నాయో అర్థం కావటం లేదన్నారు.

### ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో

# ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక**
**రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గ్రామీణ ప్రాంతంలోని ఆర్ఎంపీ, పిఎంపీల సమస్యలను పరిష్కరించడానికి తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్యవేదిక కృషి చేస్తుందని, ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఆర్ఎంపీ, పిఎంపీల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆర్.ఎం.పి మరియు పి.ఎం.పి లు ఎంతోమంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, చాలీచాలని ఆదాయంతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని ప్రభుత్వాలు అదుకోవాలని అన్నారు. కరోనా లాంటి మహమ్మారిని ఎదుర్కొవడంలో క్షేత్రస్థాయిలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని సంక్షేమ పథకాలలో ఆర్ఎంపీ మరియు పీఎంపీలకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆర్ఎంపీ మరియు పిఎంపి మిత్రులు ప్రాథమిక చికిత్స ను మాత్రమే అందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపి మరియు పిఏంపీల అభివృద్ధికి, సంక్షేమానికి, తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రేగుచింతల లింగం, జయప్రకాశ్, శేఖర్ రెడ్డి, కార్యదర్శ్ నాగార్జున శ్రీనివాస్ చారి, యాచారం మండల అధ్యక్షుడు మంద మహేందర్, హయత్ నగర్ మండల అధ్యక్షులు విప్ప వెంకటేశ్వర్లు, భిక్షపతి, ప్రొద్దుటూరు రవీందర్, మండల నాయకులు సురేష్, కృష్ణ, రమేష్, శ్రీశైలం, బుచ్చిరెడ్డి, జితేందర్ చారి, లక్ష్మణ్, రాజు నాయక్ వివిధ మండలాల బాద్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్‌లో భారతి చట్టం2025పై అవగాహన సదస్సు


**సమగ్రమైన వివరాలతో భూధార్.. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'భూ భారతి 2025' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం, షాబాద్ మండల్లోని స్టార్ ఫంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం2025 పై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యతులో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు తప్పని సరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మ్యుటేషన్ ఫీస్ క్రింద ఎకరాకు 2500 రూపాయలు ఉంటుందన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతోపాటు, వారసత్వ భూముల మ్యుటేషన్‌ను గడువులో పూర్తి చేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పని చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో మండల వ్యవసాయాధికారుల సహకారంతో రైతు వేదికల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహణ చేసి, ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని, భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. సదస్సులో రైతులు అడిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. సదస్సులో పాల్గొన్న చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల గురించి ఆలోచన చేస్తూ రైతు ప్రయోజనాలను కాపాడుతుందన్నారు. ఏక కాలంలో రుణమాఫీ జరిగిందని, నియోజక వర్గానికి ఇప్పటికే రైతులకి రుణ మాఫీ జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా రైతులకు అనేక సౌకర్యాలు కల్పించి రైతును రాజు గా చూడడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. భూ భారతి చట్టంపై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు మన జిల్లా అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. సమావేశానికి ముందు ఆర్డీఓ చంద్రకళ భూభారతి కొత్త ఆర్వోఆర్ చట్టం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చట్టం లో తీసుకొచ్చిన చట్టాల గురించి ప్రత్యేకంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఎమ్మార్వో, ఎంపీడీవో, రైతులు, రైతు సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో బీఆర్ఎస్ ఖాళీ

**ఎర్రెబెల్లికి అత్తా కోడళ్ళ బిగ్ షాక్.. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో భారీ చేరికలు**



**హైదరాబాద్, మహా:** పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేయించే పనిలో ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పడ్డారు. మాజీ మంత్రి ఎర్రబెల్లికి అత్తా కోడళ్ళు షాకిచ్చారు. గురువారం టిపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతలు కాంగ్రెస్ లోకి క్యూ కట్టారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మెన్ డా.పొనుగోటి సోమేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన పరిపాలన అందిస్తున్నదని, అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# అర్చితను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** యుపిఎస్సిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అర్చితను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణానికి చెందిన హర్షిత అనే యువతీ యుపిఎస్సి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 739 ర్యాంకు సాధించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ అర్చిత స్వగృహానికి చేరుకొని అర్చితను సన్మానించారు. దేశంలోనే ఉన్నతమైన పరీక్షలో అత్యున్నత ప్రతిభను కనబరిచిన అర్చితకు శుభాకాంక్షలు తెలిపారు. యువత ప్రతి ఒక్కరూ అర్చిత ను ఆదర్శంగా తీసుకొని కన్న తల్లిదండ్రులకు పుట్టిన వారికి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు .

# భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం

## రైతులకు ఉచిత న్యాయ సేవలు

### ఆధార్ తరహాలో భూకమతాలకు భూదార్ సంఖ్య కేటాయింపు

### ఏటా భూ రికార్డుల ఆధునీకరణ.. అవగాహన సదస్సుల్లో కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో గడువులోగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గురువారం మానకొండూర్ లోని కేవీస్ఆర్ ఫంక్షన్ హాల్, శంకరపట్నంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు కలెక్టర్ హాజరై చట్టంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ధరణి చట్టంతో చిన్న సమస్య పరిష్కారం కోసమైనా సివిల్ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడే వారన్నారు. కానీ భూభారతి చట్టంలో రెండంచెల అప్పీలు వ్యవస్థ తీసుకొచ్చారని దీంతో చాలావరకు భూ సమస్యలు తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలోనే పరిష్కారం అవుతాయని వివరించారు. నూతన చట్టంలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని.. పేదలకు ఉచిత న్యాయ సేవలు కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మనకు ఆధార్ తరహాలో భూ కమతాలకు భూదార్ సంఖ్య కేటాయించనున్నట్లు వివరించారు. దీంతో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. గతంలో రికార్డులు చూసి రిజిస్ట్రేషన్లు చేసేవారని కొత్త చట్టంలో మాత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలు తెలుసుకున్న తరువాతనే రిజిస్ట్రేషన్లు చేస్తారని అన్నారు. భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాల్లో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాపు) పొందుపరుస్తామని వివరించారు. ఈ చట్టం లో నివాస స్థలాలు, గ్రామకంఠం, ఆబాది స్థలాలు, వ్యవసాయేతర భూముల వివరాలను కూడా పొందుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా మోసపూరితంగా ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ, ఆబాది భూములు, అసైన్డ్ భూములు పొందితే విచారించి వాటిని రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుందని స్పష్టం చేశారు. తమ భూ సమస్యలు పరిష్కరించాలని అప్పీలు చేసుకున్న రైతులకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తమ భూములపై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భారతి చట్టం ప్రవేశం పెట్టడానికి ముందు క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కరించేందుకు తహసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ కు అధికారాలు ఇచ్చారన్నారు. దీంతో గతంలో కలెక్టర్ వద్ద పెండింగ్ లో దరఖాస్తుల సంఖ్య 11వేల నుంచి రెండు వేలకు తగ్గిందన్నారు.

అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ కారణంగా భూ సమస్యలు పెరిగిపోయాయని అన్నారు. అప్పుడు కేవలం భూ సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్ కి ఉండేదని.. నూతన చట్టంతో కిందిస్థాయి అధికారులకు కూడా అధికారాలు ఇచ్చారని తెలిపారు. ఏవైనా భూసమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు మాట్లాడుతూ చట్టంలోని వివిధ రకాల సెక్షన్లను వివరించారు. సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులపై కోర్టు స్టే విధించడం వల్ల ధరణిలో పరిష్కరించేందుకు అవకాశం లేకపోయిందని.. ప్రస్తుత ఈ కొత్త చట్టంలో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. అంతకు ముందు కాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ తో అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ

## ఈ నెలాఖరు వరకు గడువు.. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఎల్.ఆర్.ఎస్.తో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని చేజార్చుకోవద్దని, సద్వినియోగం చేసుకోవాలని, అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు ఇంతకంటే అవకాశం మరొకటి ఉండదని, ఈ నెల 30లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని భూ యజమానులకు సూచించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి. బుధవారం కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఎల్ఆర్ఎస్ కు సమర్పించిన ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దరఖాస్తులపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి ఎల్ ఆర్ ఎస్ రాయితీ గడువు ముగుస్తున్నందున త్వరపడాలన్నారు. గడువు పొడిగించే అవకాశం లేకపోవచ్చునని, మళ్లీ ఇటువంటి అవకాశాలు రావని, భూ యజమానుదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో అర్హులైన వారందరు ఎల్ఆర్ఎస్ రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మరోసారి గుర్తు చేశారు. ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి సత్వరమే అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు. అనధికారికంగా లే అవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలియజేసారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్.ఆర్.ఎస్. రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు. అందుచేత అర్హులైన వారందరు ఏప్రిల్ 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఈ గడువు మార్చి 31తో ముగియగా, ప్రభుత్వం ఏప్రిల్ 30వ తేదీ అనగా ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించిందని అన్నారు. రాయితీ వర్తింపునకు ఇదే చివరి అవకాశం అని కలెక్టర్ స్పష్టం చేశారు.



## సీనియర్ సివిల్ జడ్జిగా స్వాతి రెడ్డి బాధ్యతలు

### షాద్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డికి స్వాగతం పలికిన బార్ అసోసియేషన్

**షాద్ నగర్, మహా :** షాద్ నగర్ సీనియర్ సివిల్ కోర్టులో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి. గురువారం షాద్ నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి స్వాతి రెడ్డికి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగిందనీ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గా వేణుగోపాల్ నర్వ, వైస్ ప్రెసిడెంట్ చిపిరి చంద్ర శేఖర్ యాదవ్, జనరల్ సెక్రటరీ గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ అంతరం నర్సింలు, లైబ్రేరియన్ సెక్రటరీ బొమ్మగాల రమేష్ గారు, కోశాధికారి లింగం గౌడ్, సెక్రటరీ జయమ్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ రహీమ్ ఉద్దీన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ 1.పబ్బే శ్రీశైలం, రెవెల్లి విజయ్ కుమార్ గౌడ్, విజయ్ భాస్కర్, బేరీ శ్రీనివాస్, పత్లవత్ రూప సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ కే ఇంద్రార్చిత గర్వకారణం

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### యుపిఎస్సి ర్యాంకర్ ఇంద్రార్చితను సన్మానించిన ఎమ్మెల్యే

### చదువులకు కాంగ్రెస్ పెద్దపీట.. ఫెయిల్యూర్స్ చూసి సక్సెస్ సాధించా.. ఇంద్రార్చిత

### ఇంద్రార్చితకు కాంగ్రెస్ శ్రేణుల అభినందనల వెలువ



**షాద్ నగర్, మహా :** ఎంతో కష్టపడి చదివి కన్న తల్లి దండ్రులకు, పుట్టి పెరిగిన ప్రాంతానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం కన్నా అదృష్టం ఏముంటుందని షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" అన్నారు. యూపీఎస్సీ ఫలితాల్లో 735వ ర్యాంకు సాధించిన షాద్ నగర్ పట్టణానికి చెందిన రాఘవేందర్ రావు అలియాస్ మంజుశ్రీ రఘు, మమతా దంపతుల కుమార్తె ఇంద్రార్చితను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్ పట్టణ అధ్యక్షుడు కే చెన్నయ్య, స్థానిక మాజీ కౌన్సిలర్ విజయకుమార్ రెడ్డి తదితర స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. కీర్తిశేషులు మంజుశ్రీ నారాయణరావు వ్యాపారం నిమిత్తం షాద్ నగర్ ప్రాంతానికి పూర్వం వచ్చారని వారి కుమారులు తన తోటి వారిని వారితో తనకు ఎంతో పరిచయం ఉందని పేర్కొన్నారు. రఘు కూతురు ఇంద్రార్చిత యుపీఎస్సీలో ర్యాంకు సాధించి ఈ ప్రాంతానికి గొప్ప పేరు ప్రక్షాతలు తీసుకురావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని కొనియాడారు. ప్రభుత్వం కూడా ఉన్నత విద్య ప్రమాణాల కోసం కృషి చేస్తుందని చదువులకు పెద్దపీట వేసిందని విదేశీ విద్య చదువుకునే పేదలకు సైతం సాయం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వాలు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా పిల్లల చదువులతో ఆటలాడుకున్నారని ఈ సందర్భంగా విమర్శించారు. చదువులకు ప్రాముఖ్యత తప్పకుండా అందిస్తామని మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తామని అన్నారు. ఇందార్చిత కుటుంబ సభ్యులను తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా కలుసుకొని వారిని సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో ఇంద్రార్చిత మరింత ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రాఘవేంద్రరావు మమత దంపతులతో పాటు కుమారుడు డాక్టర్ ఇంద్రజిత్, ఇంద్రాక్షిత, ప్రశాంత్, నరసింహ తదితరులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.

**ఫెయిల్యూర్స్ చూసి సక్సెస్ సాధించా.. ఇంద్రార్చిత**

ఈ సందర్భంగా ఇంద్రార్చిత మీడియాతో మాట్లాడుతూ ముందుగా ఫెయిల్యూర్స్ చూశానని ఆమె స్పష్టం చేశారు. బాగా కష్టపడి ఎంతో పట్టుదలతో యుపిఎస్సిలో విజయం సాధించడం జరిగిందని చెప్పారు. ఆరు సార్లు ప్రయత్నించానని చివరగా విజయం సాధించాలని ఆమె చెప్పడం విశేషం. తనకు మద్దతుగా నిలిచిన తన తల్లిదండ్రులు కుటుంబ సభ్యులకు తనకు విద్యను నేర్పిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబం వ్యాపార అభివృద్ధికి ఈ ప్రాంతం వచ్చిందని తన తాత మంజుశ్రీ నారాయణరావు ఇక్కడ ఆర్థికంగా నిలదుక్కుకున్నారని వారితో పాటు తన కుటుంబ సభ్యులు ఎంతో కష్టపడి ఇక్కడ వ్యాపారాన్ని అభివృద్ధి చేసి తనను చదువుల్లో ప్రోత్సహించారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. సమాజం కోసం తన వంతు పాత్రను కూడా పోషిస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. తనను ఆశీర్వదించడానికి వచ్చిన ఎమ్మెల్యే శంకర్ తదితర పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రఘు నాయక్, ఆగ్గనూర్ బస్వాం అప్ప, ఇబ్రహీం, విజయ్ కుమార్ రెడ్డి, సోలి పూర్, శ్రీశైలం గౌడ్, జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మురళి మోహన్ అప్పి, పెంటయ్య, మధవులు యాదవ్, రాజు నాయక్, యువజన కాంగ్రెస్ నేత పులి మామిడి రాజేష్ గౌడ్ , జాంగారి రవి, నల్లమోని శ్రీధర్, ఖదీర్, ఖాబిర్, గోపాల్ నాయక్, నడీకూడ యాదగిరి యాదవ్, మధుర పూర్ శ్రీనివాస్, జయ ప్రకాష్ జెపి, అర్జున్ లక్ష్మ న్, కొప్పానుర్ ప్రవీణ్, దాకం మనీష్, జగదీష్, మార్గం రాజేష్, ఆర్ శ్రీకాంత్, గంగనమోని సత్యయ్య, రోమియో రమేష్, మహాబుబ్, మల్లేష్, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు..



## మన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** మన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి జై భాపు, జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ అంటూ గ్రామాల ప్రజలకు తెలియజేశారు. యాచారం మండలం, నంది వనపర్తి, మంథన్ గౌరెల్లి, చింతపట్ల గ్రామాలలో, గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ మనదేశ భవిష్యత్ కోసం మన నినాదమని అన్నారు. మన దేశ రాజ్యాంగం మన హక్కుల పరిరక్షణ కొరకు నిలువుటద్దమని, మన రాజ్యాంగం గురించి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. మండలంలోని గ్రామ గ్రామాన పర్యటిస్తూ రాజ్యాంగాన్ని కాపాడేలా ప్రజలను మరింత చైతన్య వంతం చేయాలని ఆయన అన్నారు. రాజ్యాంగంపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఆయన ఎండగట్టారు. అఖండ భారతావానికి మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సేవలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.గిరిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు మంకాల దాసు, రాచర్ల వెంకటేశ్వర్లు, బిల్లకంటి శేఖర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, మహిళా నాయకురాలు అమృత సాగర్, ముచ్చర్ల సంపత్, అరవింద్, ఐలయ్య గౌడ్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ కలప రవాణా

## ఇటుక బట్టీల్లో కాలిపోతున్న అటవీ సంపద .. పట్టించుకోని అధికారులు



**డోర్నకల్ ,మహా:** పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితలకే పరిమిత అవుతున్నాయి. అటవీ ,రెవెన్యూ శాఖ అధికారుల అలసత్వంతో మరిపెడ మండల చుట్టుపక్కల ప్రాంతంలో ఈ దందా జోరుగా సాగుతుంది. కలపకు ఇటుక బట్టీల నుంచి మంచి డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు చెట్లు నరికి చీకట్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది దళారులు పంట పొలాల్లో అనుమతులు లేకుండా చెట్లను నరికి రాత్రులు సూర్యాపేట, జనగాం, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం వన మహోత్సవం పేరిట ఖర్చు చేసిన కోట్ల రూపాయలు వృధా అవుతున్నాయని ఆరోపిస్తున్నారు.

**ఒక చెట్టుకు అనుమతి**

రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాతాన్ని రెట్టింపు చేసే ఉద్దేశంతో లక్షల రూపాయలు వెచ్చించి వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమం ప్రతి ఏటా చేపడుతున్న మొక్కలు నాటుతున్న 50% మొక్కలు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న 40 శాతం మేర మొక్కలు నాటితే 30% వరకు చెట్లను నరికేస్తున్నారు. మరిపెడ మండల పరిధిలో వెంకంపాడు, తానంచర్ల, ఆనేపురం, బావోజి గూడెం, చింతలగడ్డ తండా, ప్రాంతాల్లో ఎక్కువగా చెట్లు నరికేస్తున్నారు. మండలంలో పెద్ద ఎత్తున ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి అధికారులు సైతం పత్రికల్లో వచ్చినప్పుడు తప్ప మిగతా సమయంలో పట్టించుకోవడంలేదని అపవాదు మూట కట్టుకుంటున్నారు. కొంతమంది అనుమతులు తీసుకుంటున్న ఒక చెట్టుకు అనుమతి తీసుకుని ఎక్కువ మొత్తంలో చెట్లను నరికిస్తున్నారు ఎవరైనా ప్రశ్నిస్తే అధికారులు అనుమతి ఉన్నాయంటూ సమాధానం ఇస్తున్నారని సమాచారం. అక్రమ కలప ట్రాక్టర్లు అధికారులకు చికితే నామమాత్రంగా 500 నుంచి 1000 లేదా 2000 రూపాయల జరిమానాలు విధిస్తున్నారని సమాచారం. మండలంలో రోజుకు సుమారు ఐదు నుంచి పది ట్రాక్టర్ వరకు కలపను తరలిస్తున్నట్లు సమాచారం.

**గిరిజనుల ఆర్థిక అవసరాలే పెట్టుబడిగా**

మరిపెడ మండల కేంద్రంగా అక్రమ కలప రవణ వ్యాపారం జోరం అందుకుంది వెంకంపాడు, చింతల గడ్డ తండా ,చిల్లంచర్ల, బావోజి గూడెం, ఆనేపురం, శివారు నిలుకుర్తి, తదితర ప్రాంతాలకు అక్రమంగా కల్ప రవాణా అవుతుంది. సంపదనే ధ్యేయంగా భావించిన అక్రమార్కులు కలప వ్యాపారానికి తెర తీశారు గిరిజన గ్రామాల్లో అమాయక గిరిజనులకు డబ్బులు ఎరచూపుతూ వారిని ఈ దందాలో పావులుగా వినియోగించుకుంటున్నారు.

**ఏరోజు పట్టించుకోని ఫారెస్ట్ ఆఫీసర్లు**

మండల కేంద్రంలో ఇంత దర్జాగా అక్రమ రవణా జరుగుతున్నా.. ఏరోజు కూడా సంబంధిత ఫారెస్ట్ అధికారులు పట్టుకుని జరిమానా విధించిన దాఖలాలు లేవంటూ చుట్టుపక్కల ప్రజలు ఆరోపిస్తున్నారు.



## రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకు సాధించిన గడల రాంచరణ్

**తొర్రూర్ మహా:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంకు చెందిన గడల రామ్ చరణ్ తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో గడల రాంచరణ్ రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. హనుమకొండలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న రాంచరణ్ మంగళవారం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను గడల రామ్ చరణ్ 436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు కైవసం చేసుకుని కళాశాల కీర్తి పతాకాన్ని ఎగురవేశాడు. ఈ సందర్భంగా గురువారం హనుమకొండ లోని ప్రతిభ జూనియర్ కళాశాల క్యాంపస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల డైరెక్టర్లు కేవిఎన్ ఆచార్య, కే సత్యనారాయణ రెడ్డి , శ్రవణ్ రావు, తిరుపతి తదితరులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకు సాధించిన గడల రాంచరణ్ ను శాలువా పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి తమ కళాశాల ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పిన విద్యార్థి గడల రాంచరణ్ ను ప్రత్యేకంగా అభినందించారు. రాంచరణ్ ఇదేవిధంగా భవిష్యత్తులో కూడా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రామ్ చరణ్ మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపక బృందం కృషి, అంకిత భావంతో చేసిన విద్యా బోధన , కళాశాల యాజమాన్యం ప్రోత్సాహం వల్లనే తాను రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నాడు.

# భూభారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో రైతులకు సమస్యలకు సులువుగా పరిష్కారం లభిస్తుందని శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి, టేకుమట్ల మండల కేంద్రాలలో జరిగిన రైతుల అవగాహన సదస్సు కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ధరణిలో ఉన్న లోపాల దృష్ట్యా రైతులు ఇబ్బందులను గమనించి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు ఆయన అన్నారు. ముందుగా భూ భారతి చట్టం యొక్క అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టా జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చిన ట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్డ్ సర్వే యర్ ద్వారా హద్దులు తో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపు కు అవకాశం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డిఓ, ఆర్డిఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన రికార్డుల నవీకరణలను చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఆధార్ ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పహాణి కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డిఓ రవి, తహశీల్దార్ సునీత, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

### బి విజయ సారథి సిపిఐ జిల్లా కార్యదర్శి



**డోర్నకల్, మహా:** రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం పై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి పిలుపునిచ్చారు. కొరివి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం బి ప్రభేష్ అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి విజయ సారథి మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా పాలన చేస్తున్న బిజెపి భారత రాజ్యాంగ వ్యవస్థలను నాభిన్నం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ క్లారిటీ వర్గాలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ రాజ్యాంగంలో కల్పించిన అవకాశాలను తుంగలో తొక్కి లౌకిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన బిజెపి పాలనపై ప్రజాస్వామిక శక్తులు ఏకమై ప్రతిఘటించాలని కోరారు. మే నెలలో శాఖ మండలం మహాసభలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**ఆత్మ చైర్మన్ గా నల్లు సుధాకర్ రెడ్డి కి ఘన సన్మానం**

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ గా నల్లు సుధాకర్ రెడ్డి ఎంపిక కావడం పట్ల పార్టీ జిల్లా కార్యదర్శి హర్షం వ్యక్తం చేసి మండల నాయకులు ఘన సన్మానం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు కురవి మరిపెడ డోర్నకల్ దంతాలపల్లి మండల కార్యదర్శులు కరణం రాజన్న మారగాని బాలకృష్ణ, తురక రమేష్, పోలెపాక వెంకన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న, దొంతు రాంమ్మూర్తి, తురక రమేష్, నర్సింగం గురవయ్య బసవ కొమరయ్య, బొల్లం ఉప్పలయ్య కలగూర నాగరాజు, కన్న వెంకన్న, దూది కట్ల సారయ్య , బొల్లు వెంకన్న చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ లో గురువారం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 184 కొనుగోలు కేంద్రాలకు గాను 179 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 22 వేల 624 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరుతో కోతలు లేకుండా కొనుగోలు చేయు విధంగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు నీడ కొరకు షామియానా, తాగునీరు, ప్యాడి క్లీనర్, మాయిశ్చర్స్, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం విడి విడిగా కొనుగోలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అని కలెక్టర్ అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, డిసిఎస్ఓ కిష్టయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లాలో రౌడీయిజానికి తావు లేదు- ఎస్పీ అఖిల్ మహాజన్

### వన్ టౌన్ స్టేషన్ లో రౌడీ మేళాలో వెల్లడి

**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో రౌడీయిజానికి తావు లేదని రౌడీలు తమ ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో రౌడీషీట్లు నమోదైన వారితో రౌడీ మేళ నిర్వహించారు. రౌడీయిజం చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తూ కోర్టులో శిక్షలు పడేలా చేస్తామని తెలిపారు. సత్ప్రవర్తన కలిగి రౌడీయిజానికి దూరంగా ఉంటే రౌడీషీట్లు తొలగించి న్యాయం చేస్తామని తెలిపారు. ప్రజలను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడం, రౌడీయిజం చేయడం లాంటివి మానుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారి పట్ల చూస్తూ ఊరుకోబోమన్నారు. వారిపై పిడి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడ బోనని హెచ్చరించారు. వారిపై పిడి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడ బోనని హెచ్చరించారు. వారిపై పిడి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడ బోనని హెచ్చరించారు. ఇలాంటి వారిపై పిడి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడబోనని హెచ్చరించారు.




# 7.39 లక్షల మందికి కొత్తగా ఈపీఎఫ్

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సామాజిక భద్రతా పథకం కిందకు ఫిబ్రవరి నెలలో నికరంగా రూ.16.10 లక్షల మంది సభ్యులు చేరారు. 2024 ఫిబ్రవరి నెలలో సభ్యుల నికర చేరికతో పోల్చితే 4 శాతం ఎక్కువ మందికి ఉపాధి లభించినట్టు ఈపీఎఫ్‌వో పేరోల్ గణంకాలు తెలియజేస్తున్నాయి. ఇందులో 7.39 లక్షల మంది కొత్తగా చేరారు. పెరుగుతున్న ఉపాధి అవకాశాలు, ఉద్యోగుల ప్రయోజనాలపై విస్తృతమవుతున్న అవగాహన, ఈపీఎఫ్‌వో అవగాహన కార్యక్రమాలు కొత్త సభ్యుల చేరిక పెరిగేందుకు కారణమని కార్మిక శాఖ తన ప్రకటనలో పేర్కొంది. కొత్త సభ్యుల్లో 4.27 లక్షల మంది 18-25 ఏళ్ల వయసు నుంచి ఉన్నారు. మొత్తం కొత్త సభ్యుల్లో వీరి వాటాయే 58 శాతంగా ఉంది. అంటే సంఘటిత రంగంలో వీరు మొదటిసారి ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. సుమారుగా 13.18 లక్షల మంది సభ్యులు ఒక సంస్థను వీడి మరో సంస్థలో చేరిపోయారు. గతేడాది ఇదే నెలలో పోల్చి చూస్తే 12 శాతం పెరుగుదల నమోదైంది. పాత ఖాతాను మూసివేయకుండా, కొత్త సంస్థకు బదిలీ చేసుకున్నారు.

## 3.37 లక్షల మంది మహిళలు

ఫిబ్రవరిలో ఈపీఎఫ్‌వోలో నికరంగా చేరిన సభ్యుల్లో 3.37 లక్షల మంది మహిళలు కావడం గమనార్హం. 2024 ఫిబ్రవరి గణాంకాలతో పోల్చి చూస్తే 9.23 శాతం పెరుగుదల నమోదైంది. ఇందులో 2.08 లక్షల మంది కొత్తగా చేరారు. 2024 ఫిబ్రవరితో పోల్చి చూస్తే కేవలం 1.26 శాతమే పెరిగింది. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి ఫిబ్రవరిలో 20.90 శాతం సభ్యులు నికరంగా చేరారు. ఆ తర్వాత తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, హర్యాన, ఢిల్లీ, తెలంగాణ, యూపీ నుంచి 5 శాతానికి పైన సభ్యులు నమోదయ్యారు. ఫిష్ ప్రాసెసింగ్, నాన్ వెజిటేరియన్ ఆహార కేంద్రాలు, సొసైటలు, క్లబ్‌లు, స్వీపింగ్ సేవల్లో సభ్యుల చేరిక పెరిగింది. ఎగుమతి సేవల్లో సభ్యుల చేరిక 41.72 శాతంగా ఉంది.

# ప్రభుత్వ బాధ్యతల నుంచి మస్క్ వెనక్కి

ప్రపంచ కుబేరుడు, దిగ్గజ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనలో చేపట్టిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)లో తన ప్రమేయాన్ని గణనీయంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. డోజ్‌కు కేటాయిస్తున్న సమయాన్ని వచ్చే నెల నుంచి తగ్గించబోతున్నట్లు చెప్పారు. టెస్లాపై దృష్టి సారించాలనే ఉద్దేశంతో వారానికి ఒకటి నుంచి రెండు రోజులు మాత్రమే డోజ్‌కు సమయం కేటాయిస్తానని మస్క్ పేర్కొన్నారు. టెస్లాపై దృష్టి సారిస్తూ అధిక సమయం దానికే కేటాయించబోతున్నట్లు మస్క్ తీసుకున్న నిర్ణయంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఎలాన్ మస్క్ డోజ్ బాధ్యతలకు అధిక సమయం కేటాయించనప్పటికీ ట్రంప్ మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. ఈమేరకు అమెరికాలోని ఓవల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన సందర్భంగా మస్క్ తెలివితేటలు, దేశభక్తిని కొనియాడారు. ఫెడరల్ సంస్కరణల్లో ఆయన చేసిన కృషిని సమర్థించారు.




## నిజమైన దేశభక్తుడు..

మస్క్ తన ప్రభుత్వ పాత్ర కంటే టెస్లా వ్యాపారానికే అధిక ప్రాధాన్యత ఇస్తారని అందరికీ తెలుసునని ట్రంప్ అన్నారు. డోజ్‌లో మస్క్ పాత్ర వివాదాన్ని రేకెత్తించినప్పటికీ టెక్నాలజీలో తాను ఎంతో కృషి చేశారని చెప్పారు. రాజకీయ విభేదాల వల్ల తన ఆవిష్కరణల ప్రాధాన్యతను తగ్గించకూడదన్నారు. తాను నిజమైన దేశభక్తుడన్నారు. స్పేస్‌ఎక్స్‌తో మస్క్ ఏరోస్పేస్ విభాగంలో చేసిన ఆవిష్కరణలను గుర్తు చేసుకున్నారు. స్పేస్‌ఎక్స్ రాకెట్లు నింగిలో దూసుకెళ్లి, తిరిగి క్షేమంగా ల్యాండ్ అవ్వడం ఒక అద్భుతం అన్నారు. ఇది కేవలం మస్క్‌తోనే సాధ్యమైందని చెప్పారు. తిరిగి తాను త్వరలోనే డోజ్‌కు అధిక సమయం కేటాయించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 మొదటి త్రైమాసికంలో టెస్లా లాభాలు 71% క్షీణించాయి. మస్క్ సంపద తగ్గడానికి తాన వ్యాపారాల్లో పెరుగుతున్న రాజకీయ ప్రమేయమే కారణమని తెలుస్తోంది. ట్రంప్ ఎన్నికల ప్రచారానికి మస్క్ భారీగా ఖర్చు చేశారు. దీంతో అమెరికా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (DOGE) అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.

# వరుస లాభాలకు బ్రేక్..


## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయి 24,246 వద్దకు చేరింది. సెన్సెక్స్ 315 పాయింట్లు దిగజారి 79,801 వద్దకు చేరింది. ఇటీవల వరుసగా పెరిగిన మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లోకి చేరుకున్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, టైటాన్, ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ స్టాక్‌లు లాభాల్లో ముగిశాయి. హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, జొమాటో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎం అండ్ ఎం, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, ఇన్ఫోసిస్, నెస్లే, టీసీఎస్ స్టాక్‌లు నష్టపోయాయి. ఈ రోజు మార్కెట్ల ఒడిదొడుకులకుగల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇన్వెస్టర్లు ఇటీవలి లాభాలను స్వీకరించేందుకు పూనుకున్నారు. ఇది అమ్మకాల ఒత్తిడికి దారితీసింది.



# ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో సేవలు నిలిపివేత.. కారణం..

ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం (సీఎస్‌ఎంఐఏ) పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా ఆగస్టు 16, 2025 నుంచి సరుకు రవాణా కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. రన్‌వే 14/32 కోసం కొత్త ట్యాక్సీవేల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో సర్వీసులను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మౌలిక సదుపాయాల ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఎయిర్‌పోర్ట్ సామర్థ్యం మెరుగవుతుందని అధికారులు తెలిపారు. తిరిగి తదుపరి నోటీసులు అందేవరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయిని చెప్పారు. ముంబయిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సరఫరా కావాల్సిన సరుకు రవాణా నవీ ముంబై విమానాశ్రయం నుంచి జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ మార్పు ఆచరణాత్మక పరిష్కారాన్ని అందిస్తున్నప్పటికీ ఫార్మాస్యూటికల్స్, పాడైపోయే వస్తువులు వంటి ప్రత్యేక సరుకు రవాణా నిర్వహణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు ఎయిర్‌పోర్ట్‌ల మధ్య దూరం, ముంబయి భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా సరుకు రవాణా ఆలస్యం కావచ్చని కొందరు భావిస్తున్నారు. సీఎస్‌ఎంఐఏకు పెరుగుతున్న ప్యాసింజర్, కార్గో రద్దీ కారణంగా ఎయిర్‌క్రాఫ్ట్‌ల రవాణా ఆలస్యం అవుతుంది. దాంతో మరిన్ని మెరుగైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఎయిర్‌పోర్ట్ వర్గాలు ఈ చర్యలకు పూనుకున్నాయి. ఎయిర్ ట్రాఫిక్‌కు గ్లోబల్ హబ్‌గా ముంబయి స్థానాన్ని బలోపేతం చేయడానికి ఈ సదుపాయాలు ఎంతో కీలకం కానున్నాయని తెలిపాయి.





# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## పొగచూరి ఎండతగలక..

# చల్లబడిన న్యూయార్క్!

### 3 డిగ్రీ సెల్సియస్‌ల ఉష్ణోగ్రత తగ్గుదల

**వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని చవిచూసిన మహానగరం**

**కెనడా కార్చిచ్చే కారణం.. తాజా అధ్యయనంలో వెల్లడి**

**న్యూయార్క్:** సూరీడుని అదృశ్య శక్తి మింగేయడం, దాంతో భూమి మీద సూర్యరశ్మి కరువై ఒక్కసారిగా వాతావరణం చల్లబడం వంటి అభూత కల్పనల్లో వింటుంటాం. అలాంటి అరుదైన, వింత ఘటనకు అగ్రరాజ్యం వేదికైంది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 2023 జూన్‌లో భానుడు భగభగమండుతున్నా సిటీలో మాత్రం వాతావరణం చల్లబడింది. ఆ నగరంలో భూమిపై సూర్యరశ్మి ప్రసరణ తగ్గిపోవడమే కారణం. ఆనాడు సమీప కెనడా (Canada) దేశంలోని అటవీ కార్చిచ్చు కారణంగా దట్టంగా కమ్ముకున్న దుమ్ము, ధూళి మేఘాల కారణంగా న్యూయార్క్‌లో ఆకాశం మొత్తం మసకబారి సూర్య కిరణాలకు కాస్తంతయినా జాగా లేకుండా పోయిందని, అందుకే ఉష్ణోగ్రత మూడు డిగ్రీ సెల్సియస్ తగ్గిందని ఒక అధ్యయనం తాజాగా వెల్లడించింది. సంబంధిత అధ్యయన వివరాలు నేచర్ కమ్యూనికేషన్స్ ఎర్త్ అండ్ ఎన్విరోన్మెంట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. భూఉపరితాన్ని సూర్యరశ్మి తాకలేకపోవడంతో కాస్తంత వెలుతురు, వేడి తగ్గడాన్ని 'గ్లోబల్ డిమ్మింగ్' అంటారు. వాతావరణ మార్పుల దుష్పరిణామాలకు ఇది సంకేతమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలిని మరింత గరళం చేసే వాయువులు భూ వాతావరణంలో చిక్కుబడిపోవడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని రట్గర్స్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు చెప్పారు.



**వ్యాధి నిరోధక శక్తి సగానికి..**

ఊహించనంతగా పెరిగిన వాయుకాలుష్యం కారణంగా స్థానికులను శ్వాస సంబంధ సమస్యలు చుట్టుముట్టాయని అధ్యయనకారులు తెలిపారు. రట్గర్స్ బృందం చేసిన మరో పరిశోధన ఎన్విరోన్మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ పెను వాతావరణ పోకడ కారణంగా నగరంలోని ప్రతి ఒక్క ఒక్కరి ఊపిరితిత్తుల్లోకి అదనంగా సగటున 9.3 మిల్లీగ్రాముల బరువైన పొగ అణువులు చొరబడ్డాయని దీంతో ఇన్ఫెక్షన్లతో పోరాడే వాళ్ల వ్యాధినిరోధక శక్తి సామర్థ్యం ఏకంగా 50 శాతం క్షీణించిందని ఆ పరిశోధన పేర్కొంది. కెనడాలో కార్చిచ్చు ఘటనలు కొనసాగినన్ని రోజులూ న్యూయార్క్‌లో ఆస్తమా సంబంధ కేసులు 44 శాతం నుంచి ఏకంగా 82 శాతానికి పెరిగాయని ప్రభుత్వ గణాంకాలే స్పష్టంచేస్తున్నాయని పరిశోధన ఉదహరించింది. ''ఈ ప్రాంతంలో ఇలాంటి దృగ్విషయం జరగడం ఇదే తొలిసారి. అయితే ఇదే చివరిసారి అని మాత్రం చెప్పలేం. వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి మళ్లీ సంభవించే ప్రమాదం ఉంది'' అని పరిశోధకుడు ఫిలిప్ డెమొక్రిటో ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో వాతావరణ మార్పుల కారణంగా ఇకపై తరచూ, అత్యధికంగా కార్చిచ్చు ఘటనలు సంభవించి ఈశాన్య అమెరికాకు కాలుష్య కష్టాలు పెరిగే అవకాశముందని ఫిలిప్ విశ్లేషించారు. కార్చిచ్చులకు, పట్టణ ప్రాంతంలో వాతావరణంలో మార్పులకు, ప్రజారోగ్యానికి మధ్య సంబంధాలను ఈ పరిశోధన విశదీకరించింది.

## ఏకంగా 1,000 కిలోమీటర్లు ప్రయాణించి..

ఫిలిప్ డెమొక్రిటో, జార్జియస్ కెలిసిడీస్‌ల సారథ్యంలోని పరిశోధనా బృందం కెనడా దావానలం తాలూకు పొగ, ధూళి ఏకంగా 1,000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి న్యూయార్క్, న్యూజెర్సీ నగరాలను కమ్మేసిన వైనాన్ని ఈ బృందం పరిశోధించింది. "ఈ దుమ్ము, ధూళి మేఘాల్లోని గోధుమ రంగ కర్బన ఆర్గానిక్ అణువుల కారణంగానే సూర్యరశ్మి భూమిని తాకలేకపోయింది. ఉష్ణోగ్రత తగ్గడానికి ఇదే కారణం. ఈ భారీ 'దుమ్ము గొడుగు' కారణంగా స్వేచ్ఛగా ప్రయాణించాల్సిన సహజ గాలికి సైతం ఆటంకాలు ఏర్పడ్డాయి. గాలి అటు ఇ టూ వేగంగా వెళ్లే పరిస్థితిలేకపోవడంతో ఎక్కడి వాయు కాలుష్యం అక్కడే గాఢంగా పరుచుకుపోయింది. ఈ కాలుష్య గాలిలోని సూక్ష్మధూ ళి కణాలు అలాగే భూమి సమీప వాతావరణంలోనే తిష్టవేశాయి. ఈ సమయంలో న్యూయార్క్ నగరంలో సూక్ష్మ ధూళి కణాలు (2.5 పీఎం) అత్యంత ఎక్కువ స్థాయిలో పోగుబడ్డాయి. పర్యావరణ పరిరక్షణా సంస్థ నిర్దేశించిన స్థాయి కంటే ఏకంగా మూడు రెట్లు ఎక్కువ సూక్ష్మధూళి కణాలు వాతావరణంలో ఉండిపోయాయి. ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుచేసిన స్థాయి కంటే ఎనిమిది రెట్లు ఎక్కువగా సూక్ష్మ ధూళి కణాలు నగర గాలిలో ఉన్నాయి" అని పరిశోధకులు చెప్పారు.

# మోస్ట్ పవర్ ఫుల్ ఆర్మీ కల్గిన దేశాలు ఇవే..

అత్యంత శక్తివంతమైన ఆర్మీ కలిగిన దేశాల జాబితాను గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్(GFP Index) విడుదల చేసింది. ఇందులో భారత్ టాప్ 5లో చోటు దక్కించుకుంది. భారత్ నాల్గో స్థానంలో నిలిచింది. అమెరికా, రష్యా, చైనాల తర్వాత స్థానాన్ని భారత్ ఆక్రమించింది. ప్రపంచ వ్యాప్తంగా 145 దేశాల సైనిక శక్తిని అంచనా వేసేంది గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ సైనిక బలంతోపాటు నేటి ప్రపంచ రక్షణ వాతావరణాన్ని ప్రభావితం చేసే వ్యూహాత్మకత, సాంకేతిక, భౌగోళిక రాజకీయ అంశాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించినట్లు గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే యూకే, దక్షిణకొరియా, ఫ్రాన్స్ తదితర దేశాలను వెనక్కి నెట్టిన భారత్.. నాల్గో స్థానాన్ని నిలబెట్టుకుంది.

**యూఎస్‌ఏ (పవర్ ఇండెక్స్ 0.0744)**

2,127,500 మంది సైనిక శక్తితో యూఎస్‌ఏ అగ్ర స్థానంలో నిలిచింది. 13,043 విమానాలు, 4, 640 యుద్ధ ట్యాంకుర్లతో కూడిన బలీయమైన సైనిక శక్తితో అమెరికా ఉంది. దాంతోపాటు అతిపెద్ద రక్షణ బడ్జెట్ కూడా అమెరికా సొంతం. అత్యాధునిక సాంకేతికత, వైమానిక ఆధిపత్యం కూడా అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టాయి.

**రష్యా (పవర్ ఇండెక్స్0.0788)**

అసాధారణ సైనిక శక్తి కల్గిన దేశాల్లో రష్యాది రెండో స్థానం. 3,570,000 మంది మిలటరీ సిబ్బంది, 5, 750 యుద్ధ ట్యాంకర్లు రష్యా సొంతం. విస్తృతమైన యుద్ధ ట్యాంకర్ల దళం, అణ్వాయుధాలు కల్గి ఉంది రష్యా. అణు సామాగ్రిని వివిధ దేశాలకు సరఫరా చేసే దేశాల్లో రష్యా కీలక పాత్ర పోషిస్తుంది. గత కొంతకాలంగా ఉక్రియెన్ తో యుద్ధం చేస్తున్న రష్యా.. చైనాతో వ్యూహాత్మక పొత్తులను కొనసాగిస్తూ తన ఆధిపత్యాన్ని కాపాడుకుంటూ వస్తుంది.

**చైనా (పవర్ ఇండెక్స్ 0.0788)**

పవర్ ఇండెక్స్ పాయింట్లలో రష్యాతో కలిసి పంచుకుంటున్న చైనా.. అత్యంత శక్తివంతమైన సైనిక సామర్థ్యం కల్గిన దేశాల జాబితాలో మూడో స్థానంలో ఉంది. చైనా సైనిక విస్తరణ, సాంకేతిక పురోగతి, ఆర్థిక శక్తి తదితర అంశాలు ప్రపంచ వేదికపై ఆ దేశ సైనిక పురోగతని చూపెడు\తోంది. 6,800 యుద్ధ ట్యాంకర్లతో అతి పెద్ద ట్యాంక్ ఫ్లీట్ కల్గిన దేశంగా చైనా ఉంది. చైనా 3,170,000 సైనిక సిబ్బందితో పాటు 3,309 యుద్ధ విమానాలను కల్గి ఉంది.

**భారత్ (పవర్ ఇండెక్స్ పాయింట్లు 0.1184)**

ప్రపంచంలోని అతిపెద్ద సాయుధ దళాలలో ఒకటిగా ఉన్న భారత్,.. నాల్గో స్థానంలో ఉంది. 5,137,550 మంది సైన్యం, 2,229 యుద్ధ విమానాలు, 4, 201 యుద్ధ ట్యాంకర్లతో భారత్ నాల్గో స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది. రక్షణ ఉత్పత్తి సామర్థ్యాలను, అణ్వాయుధాలను కల్గిన భారత్.. ఆసియా అంతటా వ్యూహాత్మకంగా తన ఉనికిని విస్తరిస్తూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది.



## పవర్ ఇండెక్స్ లెక్క ఇలా..

పవర్ ఇండెక్స్ స్కోరును లెక్కించేటప్పుడు అన్ని అంశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తారు. ఒక దేశానికి అత్యంత శక్తివంతమైన ఎయిర్‌ఫోర్స్ ఉండి, అదే దేశానికి నేవీ బలం తక్కువగా ఉంటే, ఆ దేశం మొత్తం స్కోరులో వెనకంజలో ఉంటుంది. ఇక్కడ సైనిక బలాన్ని అన్ని కోణాల్లో సమగ్రంగా లెక్కించి ఒక అంచనా వేస్తారు. పవర్ ఇండెక్స్ స్కోరు ఎంత తక్కువగా ఉంటే, ఆ దేశం అంత బలంగా ఉన్నట్లు అర్థం.

**దక్షిణకొరియా (పవర్ ఇండెక్స్ 0.1656)**

పవర్ ఇండెక్స్ జాబితాలో దక్షిణాకొరియా ఐదోస్థానంలో కొనసాగుతోంది. 3,820,000 సైనిక సిబ్బంది, 1, 592 యుద్ధ విమానాలు, 2, 236 యుద్ధ ట్యాంకర్లు దక్షిణకొరియా సొంతం. అత్యంత అధునాతన టెక్నాలజీ కల్గిన రక్షణ రంగంలో దక్షిణకొరియాది ప్రత్యేక స్థానం. దాంతోపాటు అమెరికాతో సాన్నిహిత్య సంబంధాలు కూడా దక్షిణకొరియా సైనిక బలానికి మరింత దోహదం చేస్తోంది,. ప్రధానంగా సరిహద్దుల్లో ఉత్తరకొరియాతో ఉన్న వైరంలో భాగంగా ఉద్రిక్త పరిస్థితులను దక్షిణకొరియా ఎప్పటికప్పుడు చాకచక్యంగా తిప్పికొడుతోంది.

**యూకే (పవర్ ఇండెక్స్ 0.1785)**

పవర్ ఇండెక్స్ స్కోరులో యునైటెడ్ కింగ్ డమ్(యూకే) ఆరోస్థానంలో ఉంది. 1,108,860 మంది సైనిక సిబ్బందితో పాటు 631 ఎయిర్ క్రాఫ్ట్ లు, 227 యుద్ధ ట్యాంకర్లు యూకే కల్గి ఉంది. పవర్ ఫుల్ నేవీ, శక్తివంతమైన న్యూక్లియర్ సామర్థ్యం యూకే సొంతం. నాటో సభ్యత్వం కల్గిన దేశాల్లో యూకే కీలక పాత్ర పోషిస్తోంది.

**ఫ్రాన్స్ (పవర్ ఇండెక్స్ 0.1878)**

అత్యంత శక్తివంతమైన సైనిక సామర్థ్యం కల్గిన దేశాల జాబితాలో ఫ్రాన్స్‌ది ఏడో స్థానం. 376,000 మంది సైనికి శక్తి, 976 ఎయిర్ క్రాఫ్ట్ లు, 215 యుద్ధ ట్యాంకర్లను ఫ్రాన్స్ కల్గి ఉంది. నాటోతో పాటు, యూరోపియేన్ భద్రత విభాగంలో ఫ్రాన్స్ ముఖ్య భూమిక పోషిస్తోంది. అధునాతన ఆయుధ శక్తిని ఫ్రాన్స్ కల్గి ఉంది. అధునాతమైన అణ్వాయుధాలను కల్గిన దేశంగా ఫ్రాన్స్ ఉంది.

**జపాన్ (పవర్ ఇండెక్స్ 0.1839)**

సైనిక శక్తిలో జపాన్ ఎనిమిదో స్థానంలో ఉంది. 328,150 సైనిక శక్తి, 1, 443 ఎయిర్ క్రాఫ్ట్ లు, 521 యుద్ధ ట్యాంకర్లను జపాన్ కల్గి ఉంది. మిలటరీ విభాగంలో సాంకేతికపరంగా అడ్వాన్స్ డ్ గా ఉన్న దేశం జపాన్. త్యున్నత సైనిక శిక్షణ కల్గిన దేశంగా జపాన్ కొనసాగుతోంది. ప్రధానంగా నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో జపాన్ సైనిక శక్తి అత్యంత బలంగా ఉంది.

**టర్కీ (పవర్ ఇండెక్స్ 0.1902)**

టర్కీది తొమ్మిదో స్థానం. 883,900 సైనిక సిబ్బంది, 1,083 ఎయిర్ క్రాఫ్ట్స్, 2,238 యుద్ధ ట్యాంకర్లు ఫ్రాన్స్ కల్గి ఉంది. మిడిల్ ఈస్ట్, యూరోపియన్ వ్యవహారాల్లో టర్కీ అత్యంత చురుకైన పాత్ర పోషిస్తోంది. ఎయిర్ ఫోర్స్, మిలటరీ విభాగాల్లో టర్కీ అత్యంత బలంగా ఉంది.

**ఇటలీ (పవర్ ఇండెక్స్ 0.2164)**

అత్యంత బలమైన సైనిక శక్తి కల్గిన దేశాల టాప్ 10 జాబితాలో ఇటలీది పదో స్థానం. 280,000 సైనిక శక్తిని ఇటలీ కల్గి ఉంది. 729 ఎయిర్ క్రాఫ్ట్ లు, 200 యుద్ధ ట్యాంక్లరు ఇటలీ కల్గి ఉంది. నాటోలో ఇటలీ ముఖ్య భూమికను పోషిస్తూ ఉంది.

# పాకిస్తాన్ సైన్యంలో ఫౌజీ హీరోయిన్ తండ్రి?

## క్లారిటీ ఇచ్చిన ఇమాన్వి

ప్రభాస్ ఫౌజీ సినిమా హీరోయిన్ ఇమాన్విపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్ర దాడి జరిగిన నేపథ్యంలో.. పాకిస్తాన్‌పై జనం ఆక్రోశంతో ఉన్నారు. ఈ క్రమంలో హీరోయిన్ ఇమాన్వి కుటుంబానిది పాకిస్తాన్ నేపథ్యం అని ఓ వార్త వైరలవుతోంది. ఇమాన్వి తండ్రి గతంలో పాకిస్తాన్ మిలటరీలో పని చేశాడని.. వీళ్లది కరాచీ అని సదరు వార్త సారాంశం. చాలా మంది ఇదే నిజమని భ్రమపడి.. పాక్ అమ్మాయి అయిన ఇమాన్వీని ఫౌజీ నుంచి తీసేయాలని డిమాండ్ చేశారు.

**తీవ్రంగా ఖండిస్తున్నా..**

ఈ క్రమంలో సదరు వార్తలపై ఇమాన్వి క్లారిటీ ఇచ్చింది. "పహల్గామ్‌లో జరిగిన విషాద సంఘటన పట్ల నేను హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈ హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. అదే సమయంలో నా గురించి, నా కుటుంబం గురించి జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించాలనుకుంటున్నాను. నా కుటుంబంలో ఎవరికీ పాకిస్తానీ మిలిటరీతో ఎటువంటి సంబంధం లేదు. కేవలం ద్వేషాన్ని రగిలించడం కోసమే ఇలా అబద్ధాలు పుట్టించారు.

**దుష్ప్రచారం**

దీన్ని క్రాస్ చెక్ చేసుకోకుండా కొన్ని మీడియా సంస్థలు ఆ అబద్ధాలను వ్యాప్తి చేయడం బాధాకరం. నా పై దుష్ప్రచారం చేశారు. నేను భారతీయ మూలాలున్న అమెరికన్ వాసిని. హిందీ, తెలుగు, గుజరాతీ, ఇంగ్లీష్ మాట్లాడగలను. నా తల్లిదండ్రులు యువతగా ఉన్నప్పుడు అమెరికాకు వలస వచ్చారు. తర్వాత అమెరికా పౌరులుగా మారారు. నేను లాస్ ఏంజిల్స్.. కాలిఫోర్నియాలో జన్మించాను.

### నా రక్తంలోనూ..

USAలో నా యూనివర్సిటీ విద్య పూర్తి చేసిన తర్వాత నటిగా, కొరియోగ్రాఫర్‌గా, డ్యాన్సర్‌గా కళారంగంలో వృత్తిని కొనసాగించాను. అనంతరం భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పని చేసే అవకాశాలను అందుకోవడం గర్వంగా భావిస్తున్నాను. సినిమా నా జీవితంలో గొప్ప ప్రభావాన్ని చూపింది. భారతదేశంపై ప్రేమ, భక్తి నా రక్తంలోనూ ప్రవహిస్తోంది" అని ఇమాన్వి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది.



# పెళ్లి వేడుకలో అల్లు అర్జున్ సందడి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప 2 మూవీతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద పలు రికార్డులను తిరగరాసింది. సుకుమార్ బన్నీ కాంబోలో వచ్చిన పుష్పకు సీక్వెల్‌గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించింది. ప్రస్తుతం బన్నీ జవాన్ డైరెక్టర్ అట్లీతో జతకట్టనున్నారు. వీరిద్దరి కాంబోలో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఓ పెళ్లి వేడుకలో అల్లు అర్జున్ సందడి చేశారు. తన కజిన్ పెళ్లికి ఆయన హాజరయ్యారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫోటోలను టీమ్ అల్లు అర్జున్ ట్విటర్‌లో షేర్ చేసింది. ఇది చూసిన అభిమానులు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



## తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా..

# నా భవిష్యత్తును ఆగం చేయొద్దు!


పవిత్ర లక్ష్మి.. ఈ తమిళమ్మాయి ఓ కాదల్ కణ్మని (2015) సినిమాతో వెండితెరపై ఎంట్రీ ఇచ్చింది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఈ మూవీలో అతడి కొలీగ్‌గా చిన్న పాత్రలో కనిపించింది. అదే ఏడాది ఈమె మిస్ మద్రాస్ కిరీటాన్ని సైతం గెల్చుకుంది. కూకు విత్ కోమలి అనే కుకింగ్ షోలో పాల్గొని ఎక్కువ ఫేమస్ అయింది. దీంతో ఒక్క ఏడాదిలోనే నాయి శేఖర్ (తమిళ చిత్రం), ఉల్లాసం (మలయాళం), అదృశ్యం (తమిళ, మలయాళం) అనే సినిమాలు చేసింది. జిగిరీ దోస్తు, వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ మద్రాస్ చిత్రాల్లోనూ తళుక్కుమని మెరిసింది. అయితే ఈ బ్యూటీ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుందంటూ ఈ మధ్య పుకార్లు వైరల్‌గా అయ్యాయి. ఈ రూమర్లపై పవిత్ర లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేసింది. నా లుక్ మారడం, బరువు పెరగడంతో నా గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుంటున్నారు. చాలాసార్లు వాటికి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాను. అయినప్పటికీ నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నానంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కొన్ని కామెంట్లు అయితే చెప్పడానికి కూడా వీలు లేనంత దారుణంగా ఉన్నాయి.

**నా భవిష్యత్తు ఆగం చేయొద్దు**

అందుకే మీ అందరికీ మరోసారి చెప్తున్నా.. నేను తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాను. దానికోసం చికిత్స తీసుకుంటున్నాను. ప్రస్తుతం క్షేమంగా ఉన్నాను. దయచేసి మీ వినోదం కోసం నా గురించి లేనిపోని వార్తలు రాయొద్దు. నాపై రూమర్లు సృష్టించకండి. నాకంటూ ఓ జీవితం ఉంది.. దయచేసి నా పేరు చెడగొట్టకండి.. నా భవిష్యత్తును ఆగం చేయకండి. కొంత ప్రేమ, మరికొంత గౌరవం.. మీనుంచి ఈ రెండే కోరుకుంటున్నా.. మీరెప్పుడూ నాపై ప్రేమాభిమానాలే చూపించేవారు. దాన్ని అలాగే కొనసాగించండి. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో మీ ముందుకు వస్తాను అని పవిత్ర ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది.



# క్రీడా వార్తలు | SPORTS NEWS



# గెలిచే మ్యాచ్‌లో ఓడిన రాజస్తాన్..

ఐపీఎల్ 2025లో రాజస్తాన్ రాయల్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్ ఓటమి పాలైంది. ఓ దశలో సునయాసంగా గెలిచేలా కన్పించిన రాజస్తాన్.. ఆఖరిలో వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో పరాజయం చవిచూడాల్సి వచ్చింది. 207 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేయగల్గింది. రాయల్స్ బ్యాటర్లలో యశస్వి జైశ్వాల్ (19 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49), ధ్రువ్ జురెల్ (34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 47) అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికి జట్టును గెలిపించలేకపోయారు. బెంగళూరు బౌలర్లలో జోష్ హాజిల్‌వుడ్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. కృనాల్ పాండ్యా రెండు, భువనేశ్వర్, యశ్ దయాల్ తలా వికెట్ సాధించారు. అంతకముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో విరాట్ కోహ్లి (70), పడిక్కల్ (50) హాఫ్ సెంచరీలతో మెరవగా.. డేవిడ్ (23), జితేష్ శర్మ (20) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. రాజస్తాన్ బౌలర్లలో సందీప్ శర్మ రెండు వికెట్లు పడగొట్టగా.. హసరంగ, ఆర్చర్ తలా వికెట్ సాధించారు.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి..

## ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా

ఐపీఎల్ 2025లో టీమిండియా స్టార్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓపెనర్ విరాట్ కోహ్లి తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో కింగ్ కోహ్లి హాఫ్ సెంచరీతో చెలరేగాడు. రాజస్తాన్ బౌలర్లను విరాట్ ఊతికారేశాడు. ఫిల్ సాల్ట్, పడిక్కల్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలను నెలకొల్పాడు. విరాట్ 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇక ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీలతో చెలరేగిన విరాట్ కోహ్లి పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.



**కోహ్లి సాధించిన రికార్డులు ఇవే..**

టీ20 క్రికెట్‌లో ఒకే వేదికపై 3500 పరుగులు చేసిన తొలి ఆటగాడిగా విరాట్ చరిత్ర సృష్టించాడు. బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియంలో 105 టీ20 ఇన్నింగ్స్‌లలో కోహ్లి 3500 పరుగులు చేశాడు.

**టీ20ల్లో ఒకే స్టేడియంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు వీరే..**

3500 బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియంలో విరాట్ కోహ్లి (భారత్)
3373 షేర్‌ఎబంగ్లా స్టేడియం, మీర్పూర్‌లో ముష్ఫికర్ రహీమ్ (బంగ్లాదేశ్)
3253 రోజ్ బౌల్, సౌతాంప్టన్‌లో జేమ్స్ విన్స్ (ఇంగ్లండ్)
3241 ట్రెంట్ బ్రిడ్జ్, నాటింగ్‌హామ్‌లో అలెక్స్ హేల్స్ (ఇంగ్లండ్)
3238 షేర్‌ఎబంగ్లా స్టేడియం, మీర్పూర్‌లో తమీమ్ ఇక్బాల్ (బంగ్లాదేశ్)

అదేవిధంగా టీ20 క్రికెట్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సందర్భాల్లో అత్యధిక ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు సాధించిన ప్లేయర్‌గా విరాట్ రికార్డులకెక్కాడు. ఇప్పటివరకు కోహ్లి తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు 62 సార్లు ఏభై పైగా పరుగులు సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు పాకిస్తాన్ స్టార్ బాబర్ (61) పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో బాబర్ రికార్డును కింగ్ బ్రేక్ చేశాడు. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు 9 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి.. 392 పరుగులతో ఆరెంజ్ క్యాప్ రేసులో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

**టీ20ల్లో తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు అత్యధిక ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు చేసిన ఆటగాళ్లు వీరే..**

62 విరాట్ కోహ్లి*
61 బాబర్ అజామ్, 57 క్రిస్ గేల్
55 డేవిడ్ వార్నర్, 52 జోస్ బట్లర్
52 ఫాఫ్ డు ప్లెసిస్

# అతడొక అద్భుతం..

## రెండేళ్లలో టీమిండియాకు ఆడుతాడు: శాంసన్

బీహార్‌కు చెందిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కేవలం 14 ఏళ్ల వయస్సులోనే ఐపీఎల్ అరంగేట్రం చేసి సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ తరపున సూర్యవంశీ డెబ్యూ చేశాడు. ఈ యువ ఆటగాడు తొలి మ్యాచ్‌లోనే 34 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు అందరి కళ్లు ఈ యువ ఆటగాడిపైనే ఉన్నాయి. గురువారం బెంగళూరు వేదికగా ఆర్సీబీతో రాజస్తాన్ రాయల్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో వైభవ్ ఎలా ఆడుతాడో అని అభిమానులు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సూర్యవంశీపై రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ ప్రశంసల వర్షం కురిపించాడు. సూర్యవంశీ అతి త్వరలో టీమిండియా తరపున అరంగేట్రం చేయబోతున్నాడని శాంసన్ జోస్యం చెప్పాడు. "అతడు చాలా కాన్ఫిడెంట్‌గా కన్పిస్తున్నాడు. అతడిలో చాలా పవర్ ఉంది. మా క్రికెట్ ఆకాడమీలో గ్రౌండ్ బయటకు సిక్సర్లు కొట్టేవాడు. ఇంత చిన్న వయస్సులో అతడు భారీ సిక్సర్లు ఎలా కొడుతున్నాడని అందరూ మాట్లాడుకుంటున్నారు. వైభవ్ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు సిద్దంగా ఉన్నట్లు కనిపిస్తున్నాడు. అతడు నాకు తమ్ముడు లాంటి వాడు. సూర్యవంశీ ఒకట్రెండు సంవత్సరాలలో భారత్ తరపున ఆడే అవకాశం ఉందని" శాంసన్ పేర్కొన్నాడు. కాగా సూర్యవంశీ అండర్ 14, అండర్ 16 స్థాయిలలో అద్భుతంగా రాణించాడు. ఈ క్రమంలోనే గతేడాది జరిగిన వేలంలో వైభవ్‌ను రూ. 1.1 కోట్లకు రాజస్తాన్ కొనుగోలు చేసింది.



## ధోని.. ఆ పేరు అలాంటిది మరి!: సహచర క్రికెటర్‌కు సెహ్వాగ్ కౌంటర్

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ దారుణ ప్రదర్శన కనబరుస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం ఉప్పల్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఎస్ఆర్‌హెచ్ ఓటమి పాలైంది. సన్‌రైజర్స్ ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడి 6 ఓటుమలతో తమ ప్లే ఆఫ్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో తొమ్మిదివ స్థానంలో కొనసాగుతోంది. కాగా ఎస్ఆర్‌హెచ్ ముంబై ఇండియన్స్ మ్యాచ్ అనంతరం భారత మాజీ క్రికెటర్లు వీరేంద్ర సెహ్వాగ్, అమిత్ మిశ్రాలు క్రిక్‌బజ్ లైవ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ మిశ్రాకు సెహ్వాగ్ కౌంటరిచ్చాడు.

**అసలేమి జరిగిందంటే?**

పోస్ట్ మ్యాచ్ లైవ్ షోలో మిశ్రా, సెహ్వాగ్‌లు సన్‌రైజర్స్ ప్లే ఆఫ్ అవకాశాలు గురించి చర్చించారు. అయితే మిశ్రా మాత్రం ఈ అంశం నుండి దృష్టి మరల్చి, చెన్నై సూపర్ కింగ్స్ (CSK) మరియు ప్లేఆఫ్‌కు చేరుకునే వారి అవకాశాల గురించి మాట్లాడాడు. "సీఎస్‌కే ప్లే ఆఫ్స్‌కు చేరడం దాదాపు అసాధ్యం అనుకుంటున్నాను. వారు ప్రస్తుతం ఆడుతున్న క్రికెట్ బ్రాండ్ ప్రకారం.. వరుసగా ఆరు మ్యాచ్‌లను గెలవడం కష్టం. ఒకవేళ గెలవాలంటే చెన్నై అన్ని విభాగాల్లోనూ బాగా రాణించాలి. ధోని బ్యాటింగ్‌కు వస్తే కనీసం 30 బంతులు ఆడాలి. వారి టాప్ ఆర్డర్ కూడా రాణించాలి" అని మిశ్రా పేర్కొన్నాడు. వెంటనే సెహ్వాగ్ జోక్యం చేసుకుని ప్రశ్న సీఎస్‌కే గురుంచి కాదు, ఎస్ఆర్‌హెచ్ గురించి అని మిశ్రాతో అన్నాడు. దీంతో మిశ్రా వెంటనే క్షమాపణలు చెప్పాడు. అందుకు ఇదంతా ధోనికి ఉన్న పేరు వల్లే అంటూ సెహ్వాగ్ సమాధానమిచ్చాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com